www.bharathasakthi.com

# భారత్ శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 23 | హైదరాబాద్ | శనివారం,జూన్ 27 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## వెనెజువెలాకు భారత్ భారీ సాయం.. 'ఆపరేషన్ అమిస్తాద్' ప్రారంభం



వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అండగా నిలిచింది. బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాల్లో వైద్య బృందం, భీష్మ క్యూబ్‌లు, మందులు, ఇతర సహాయ సామగ్రిని పంపింది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. వెనెజువెలా ప్రజలకు ఈ క్లిష్ట సమయంలో భారత్ అండగా

2లో..

## భారత్‌కు జపాన్ ప్రధాని.. జూలై 1 నుంచి పర్యటన

- జూలై 1 నుంచి 3 వరకు భారత్‌లో పర్యటించనున్న జపాన్ ప్రధాని
- ప్రధాని మోదీతో కలిసి 16వ వార్షిక సదస్సులో పాల్గొననున్న సనాయే తకాయిచి
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, సాంకేతికతపై చర్చలు




భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు జపాన్ ప్రధాన సనాయే తకాయిచి జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలో నిర్వహించనున్న 16వ భారత్-జపాన్ వార్షిక సదస్సులో ఇరు దేశాల ప్రధానులు పాల్గొంటారు.

# డ్రగ్ ఫ్రీ తెలంగాణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### - సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (భారత శక్తి)** మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. యువతలో సానుకూల ఆలోచనలు, విలువలు పెంపొందించి మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని "మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం" సందర్భంగా ఒక సందేశంలో పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయని, తద్వారా సమాజంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలకు దారితీస్తాయని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అక్రమ రవాణాను అరికట్టేందుకు అవగాహన, అప్రమత్తత, సామాజిక బాధ్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



## ఆధార్ నంబర్ కొడితే చాలు.. అన్ని వివరాలు రావాలి

- ఆర్టీజీఎస్ సేవలపై మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష
- ఆధార్ నంబర్‌తోనే అన్ని సర్టిఫికెట్ల డిజిటల్ వెరిఫికేషన్
- మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన
- కుల, ఆదాయ ధృవపత్రాల జారీ ప్రక్రియ మరింత సులభతరం
- డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారం అనుసంధానం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ఠ చర్యలకు ఆదేశం

**అమరావతి (భారత శక్తి)** కేవలం ఆధార్ నంబర్ ఎంటర్ చేయగానే, ఒక అభ్యర్థికి సంబంధించిన అన్ని రకాల విద్య, క్రీడా సర్టిఫికెట్లు డిజిటల్‌గా వెరిఫై అయ్యే పారదర్శకమైన, పటిష్ఠమైన వ్యవస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ సులభతరం అవ్వడమే కాకుండా, రాబోయే వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో లక్షలాది మంది అభ్యర్థులకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థి ఆధార్ నంబర్ కొట్టగానే, ఆ సర్టిఫికెట్‌ను ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు రియల్ టైమ్‌లో తెలిసేలా 'డిజి వెరిఫై' వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. ఇది అధికారుల పనిని 99 శాతం సులభతరం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల



పురోగతిని ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించే 'డేటా లేక్' పనులను జులై నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల సంఖ్యను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, వారిని తిరిగి బడికి రప్పించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్‌తో అనుసంధానించాలన్నారు.

2లో..

## తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వరు

### - కేటీఆర్



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రేవంత్‌రెడ్డి మహిళలకు తులం బంగారం కాదు కదా,తులం ఇనుము కూడా ఇవ్వరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శుక్రవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చేయలేదని, ప్రతి పంటకు బోనస్ ఇస్తానని ఇవ్వలేదన్నారు. రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని మోసం చేశారని, విద్య భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు కాదు ముందు లక్షాధికారులను చేయండి చాలు అని ఎద్దేవా చేశారు.



## రాముడి పేరుతో మోసం

### సహించేది లేదు: యోగి హెచ్చరిక

**న్యూఢిల్లీ (భారత శక్తి)** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. సనాతన ధర్మం, ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిపై జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని యోగి తెలిపారు. "అయోధ్య విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ముందే చెప్పాం. విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విపక్షాలపై కూడా యోగి తీవ్ర విమర్శలు చేశారు. "ఒకప్పుడు శ్రీరాముడు లేదని చెప్పినవారే ఇప్పుడు భక్తి గురించి మాట్లాడుతున్నారు. రామమందిర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో పోరాడినవాళ్లే ఇప్పుడు విశ్వాసం గురించి మాట్లాడటం విచిత్రం" అని వ్యాఖ్యానించారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలయ విరాళాల నగదు నిర్వహణ, ఉద్యోగుల నియామకాలు, సీసీటీవీ పర్యవేక్షణ, బంగారం, వెండి వంటి కానుకల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఫిలిప్పీన్స్‌లో మరో భారీ భూకంపం..

- దక్షిణ ఫిలిప్పీన్స్‌ను వణికించిన భూకంపం
- మిండనావోలో 6.5 తీవ్రతతో ప్రకంపనలు
- ఎత్తైన ప్రాంతాలకు పరుగులు తీసిన ప్రజలు



2లో..

## ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం బంపర్ ఆఫర్

### - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ.10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే

2లో..

## తెలంగాణ ప్రభుత్వ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు.. ఉత్తర్వులు జారీ

- ఈ నెల 30తో ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం పూర్తి
- 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు
- ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతలు
- జులై 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరణ



**న్యూఢిల్లీ (భారత శక్తి)**తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు ఇటీవలే కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ ఆయన్ను పేరెంట్ కేడర్‌కు బదిలీ చేసింది. మూడు రోజుల క్రితం ఆయన కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కే. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సంజయ్ జాజును రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జులై 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

## తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు




**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా

2లో..

## రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు... బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



**న్యూఢిల్లీ (భారత శక్తి)** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉద్ధృతం చేసింది. ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "ఛడ్ దే ఇండియా", "రాహుల్ ఇన్ పారిస్", "పరదేశ్" వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ "స్వదేశ్ వర్సెస్ పరదేశ్" పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్

2లో..

# వార్డు ప్రజల సంక్షేమమే తమ ధ్యేయం

## 9వ వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న



సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 26:వార్డు ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని ప్రజలు ఆరోగ్యరీత్యా క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నామని, సైడ్ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం మురుగు అంతా ఎప్పటికప్పుడు మున్సిపల్ కార్మికులతో తీయిస్తున్నామని సూర్యాపేట మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న అన్నారు. శుక్రవారం వార్డులో జిమ్ పార్కు వద్ద గల సైడ్ కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం మురుగు మున్సిపల్ కార్మికులతో దగ్గరుండి తీయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని తెలిపారు.కాలువల్లో ప్లాస్టిక్ సీసాలు గ్లాసులు వాకిళ్లలో వచ్చిన దుమ్ము దూళి చెత్తాచెదారం ఉద్చరాదని సూచించారు. వర్షాకాలం సీజన్ కనుక దోమలు ఈగలు ఇళ్లలోకి వచ్చి ఇబ్బందులు పెడతాయి. దీని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ చుట్టుపక్కల వాతావరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

# యాదగిరిగుట్టలో "ఛాత్రోన్ కీ గూంజ్"

## - కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

## - రాహుల్ గాంధీ కార్యక్రమాన్ని వీక్షించిన కాంగ్రెస్ నాయకులు



భారత శక్తి, జూన్ 26(యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట పట్టణంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజస్థాన్‌లోని కోటలో విద్యార్థులు, యువత సమస్యలను తెలుసుకుని వారి గొంతుకగా ప్రారంభించిన "ఛాత్రోన్ కీ గూంజ్" (విద్యార్థుల స్వరం) కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు బీర్ల అయిలయ్య వేలాది మంది విద్యార్థులు, యువతతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజస్థాన్ కోటలో రాహుల్ గాంధీ మాట్లాడిన అంశాలను ఎల్ఈడి స్క్రీన్ లో వీక్షించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ విద్యార్థులు మరియు యువత ఎదుర్కొంటున్న సమస్యలను దేశవ్యాప్తంగా వెలుగులోకి తీసుకురావడమే "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నాణ్యమైన విద్య, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థ, ఉద్యోగాల భర్తీ, యువతకు సమాన అవకాశాలు కల్పించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, యువత ఆశయాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచే హక్కు కలిగి ఉండాలని, వారి సమస్యలు ప్రభుత్వాల దృష్టికి చేరేలా ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని అన్నారు. వేలాది మంది యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను వెల్లడించారు. కార్యక్రమంలో విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, యూత్ కాంగ్రెస్ ఇంచార్జి భవ్యశ్రీ , యూత్ కాంగ్రెస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఫైజర్, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రణధీర్,మున్సిపల్ చైర్మన్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# బారుగుపల్లిలో ఆధ్యాత్మిక శోభ..

## - వైభవంగా ద్వజస్తంభ-బలిపీఠ ప్రతిష్ఠా మహోత్సవం.




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 26 (భారత శక్తి )మామడ మండలంలోని బారుగుపల్లి, గ్రామంలోని స్వయంభూ శ్రీ మీనాంబిక సమేత శ్రీ నిజ్జేశ్వర స్వామి దేవాలయంలో ద్వజస్తంభ, బలిపీఠ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నెల 28, 29 తేదీలలో శైవాగమ శాస్త్రోక్త పద్ధతిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, యాగాలు, వేదమంత్రోచ్చారణల మధ్య జరిగే మహోత్సవానికి భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఈ నెల 28వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, గణపతి పూజ, గోపూజ, అంకురార్పణం, నాంది, నవగ్రహ పూజలు, మండలారాధనలు, ప్రధాన కలశ స్థాపన, రుద్రహోమం, పూర్ణాహుతి తదితర విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం చండీహోమం, ద్వజస్తంభ అభిషేకం, ధాన్యాధివాసం, ఫలపుష్పాధివాసం కార్యక్రమాలు జరగనున్నాయి.29వ తేదీ సోమవారం ఉదయం 8:26 గంటలకు శుభముహూర్తంలో ద్వజస్తంభ ప్రతిష్ఠ, బలిపీఠ ప్రతిష్ఠ, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు.ఈ మహోత్సవంలో ధ్వజస్తంభ దాతలుగా తీగల రవి చెన్ను -- మధుపురి జ్యోతి దంపతులు విశేష సేవలు అందిస్తూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.మహోత్సవ విజయవంతానికి బారుగుపల్లి గ్రామ సర్పంచ్ అర్లకొండ జగన్ మోహన్ రెడ్డి (స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్) ప్రత్యేక సహకారం అందిస్తున్నారు. అలాగే ద్రోణాచలం రాణి, తీగల రాజు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు కార్యక్రమ ఏర్పాట్లలో చురుకుగా పాల్గొంటున్నారు.ఈ మహోత్సవానికి ఆలయ అర్చకులు శ్రీ కాశీనాథ్ బాబుగారు, నవమేష్ కాలేవర్ కుటుంబ సభ్యులు ప్రధాన నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు. మహోత్సవానికి విచ్చేసే భక్తులకు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.వేలాది మంది భక్తుల సమక్షంలో జరగనున్న ఈ మహోత్సవం బారుగుపల్లి గ్రామ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలవనుండగా, భక్తులందరూ పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# యువత మత్తుకు దూరంగా ఉండాలి.

## - యాదగిరిగుట్టలో పోలీసుల ఆధ్వర్యంలో 2కె రన్

## - అధిక సంఖ్యలో పాల్గొన్న యువకులు, విద్యార్థులు



భారత శక్తి, జూన్ 26 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): తెలంగాణ డిజిపి సీవీ ఆనంద్ చేత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ ఆదేశాల మేరకు శుక్రవారం యాదాద్రి డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో యాంటి డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ భాస్కర్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు యాదగిరిగుట్ట మండలంలోని పలు పాఠశాలలకు, కళాశాలకు సంబంధించిన విద్యార్థులు, యువతతో పట్టణంలోని మల్లాపూర్ ఎక్స్ రోడ్ నుంచి పాదాల వరకు 2కె రన్ ను నిర్వహించడం జరిగింది. అనంతరం డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఇన్స్పెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు మత్తుకు బానిస కావద్దని, ఆరోగ్యంగా ఉంటేనే ప్రతి వ్యక్తిలో ఏ పని చేయడానికి అయినా నమ్మకం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా దృఢంగా ఉండాలని సూచించారు. మన తెలంగాణను మాదక ద్రవ్యాల రహిత తెలంగాణగా మార్చాలని ఇట్టి విషయంలో అందరూ కృషి చేయాలని యువతకు పిలుపునిచ్చారు.

# లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,





నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 26 (భారత శక్తి )లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, బెయిల్ కేసుల నిర్వహణ, రిసెప్షన్, మాల్ఖానా, ఆయుధాగారం, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, పోలీస్ స్టేషన్ పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం, లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని కూడా ఎస్పీ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఎస్పీ సమావేశమై వారి విధి నిర్వహణ, పని తీరుపై మాట్లాడారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదును చట్టప్రకారం సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, సూచించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, డీఎస్పీ శ్రీనివాస్, సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్‌చందా ఎస్ఐ శ్రావణి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామాజీపేట పాల సంఘం చైర్మన్ గా కల్లూరి శిరీష శంకర్ రెడ్డి



భారత శక్తి, జూన్ 26 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామ పాల సంఘం చైర్మన్ గా కల్లూరి శిరీష శంకర్ రెడ్డి (బిఆర్ఎస్) ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గుజ్జ బలరాం తెలిపారు. అలాగే నూతన డైరెక్టర్లుగా మొగిలిపాక ఇస్తారి, పోతరాజు నర్సింహులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ మరియు డైరెక్టర్లను గ్రామ సర్పంచ్ గడ్డం దేవేందర్, పాలవర్గ సభ్యులు ఇతర డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం దేవేందర్, మాజీ సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్, మాజీ సర్పంచ్ నమిలే ఉపేంద్ర వెంకట్రాజు, ఉపసర్పంచ్ యాట పరుషురాం వార్డు సభ్యులు ఆరె బాలమణి, మొగిలిపాక భానుప్రకాష్, పెరుమండ్ల అరుణ ముత్యాలు, మొగిలిపాక పృథ్వీరాజ్, నాయకులు కల్లూరి రఘుపతిరెడ్డి, కొండపురం ఆంజనేయలు, మొగిలిపాక భాస్కర్, కల్లేపల్లి బాలరాజు, మహేష్, క్రాంతి, డైరెక్టర్లు జాగ్గిళ్లపురం ధశరథ, కుండె కమలమ్మ, కొండపురం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట ఆలయ ఈవో పదవీ కాలం పొడిగింపు



భారత శక్తి, జూన్ 26 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో)గా విధులు నిర్వహిస్తున్న జె భవాని శంకర్, ఐఏఎస్ (2019 బ్యాచ్)కు తెలంగాణ ప్రభుత్వం మరో ఏడాది పాటు పదవీకాలాన్ని పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఈవో భవాని శంకర్ పదవీ కాలం ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధి పనులు, పరిపాలన, భక్తులకు మెరుగైన సేవల కల్పనను దృష్టిలో ఉంచుకుని జూలై 01 వ తేదీ నుండి ఏడాది పాటు ఆయనను తిరిగి దేవస్థానం ఈవోగా నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

# వెనెజువెలాకు భారత్ భారీ సాయం.. 'ఆపరేషన్ అమిస్తాద్' ప్రారంభం

ఉంటుందని స్పష్టం చేశారు. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉన్నారు. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు వీరు సిద్ధంగా ఉన్నారు. విదేశాంగ శాఖ అందించిన సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రి కూడా వెంట తీసుకెళ్లారు.అలాగే ఆరోగ్య మైత్రి ప్రాజెక్టు కింద రూపొందించిన రెండు భీష్మ క్యూబ్‌లను కూడా పంపించారు. ఇవి విపత్తుల సమయంలో తాత్కాలిక ఆసుపత్రులుగా ఉపయోగపడే ఆధునిక వైద్య యూనిట్లు. వెనెజువెలాలో బుధవారం నిమిషం వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో ఇప్పటివరకు 235 మంది మృతి చెందారు. 1,500 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇంకా గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. రాజధాని కరాకస్, లా గువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా తదితర దేశాలు కూడా సాయాన్ని ప్రకటించాయి.

# భారత్‌కు జపాన్ ప్రధాని.. జూలై 1 నుంచి పర్యటన

జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాయే తకాయిచి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. వాస్తవానికి, ఈశాన్య రాష్ట్రాల్లో జపాన్ చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు చిహ్నంగా ఈ సదస్సును గౌహతిలో నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, ప్రధాని తకాయిచి పర్యటన షెడ్యూల్ మరియు ఇతర లాజిస్టికల్ కారణాల రీత్యా వేదికను ఢిల్లీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు. గత ఏడాది టోక్యోలో జరిగిన 15వ సదస్సుకు కొనసాగింపుగా ఈ సమావేశం జరగనుంది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత మరియు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వం వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై నేతలు చర్చించనున్నారు. ముఖ్యంగా ఆర్థిక భద్రత, కీలక ఖనిజాలు, ఇంధన సరఫరా వ్యవస్థల బలోపేతం మరియు రక్షణ రంగ సహకారం వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉండే అవకాశం ఉంది.

# ఆధార్ నంబర్ కొడితే చాలు..

### ప్రజా సేవలు మరింత చేరువ కావాలి

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై నెలరోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సేవలను ఎలా వినియోగించుకోవాలి, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో ఉన్న అడ్డంకులను తొలగించాలని, రేషన్ కార్డుల విభజన, పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని స్పష్టం చేశారు.

### ఎల్‌నినో, విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తత

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జలవనరులు, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జలాశయాల్లో నీటి లభ్యత, భూగర్భజలాల స్థాయిని ఆర్టీజీఎస్‌లోని 'అవేర్' విభాగం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, ముఖ్యంగా రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం బంపర్ ఆఫర్

కాకుండా..నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు.?తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. ?గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ ఈఎంఐలు, కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది.మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగుల హక్కులను కాపాడాలి అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు.

# తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్‌ఎండీఏ (HMDA) జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ (R&B) స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ ఌ ఎక్స్-అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# ఫిలిప్పీన్స్‌లో మరో భారీ భూకంపం..

దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని మిండనావో ప్రాంతంలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం, శుక్రవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో ఈ శక్తివంతమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో భయాందోళనకు గురైన తీరప్రాంత ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి, ముందుజాగ్రత్త చర్యగా ఎత్తైన ప్రదేశాలకు పరుగులు తీశారు.అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్), జర్మన్ రీసెర్చ్ సెంటర్ (జీఎఫ్‌జెడ్) నివేదికల ప్రకారం, దవావో రీజియన్‌లోని సారంగానికి 34 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో సుమారు 42 నుంచి 52 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం ధాటికి దవావో నగరంలోని భవనాలు కంపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే, ఈ భూకంపం వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు ప్రస్తుతానికి ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు.ఇదే ప్రాంతంలో జూన్ 8వ తేదీన 7.8 తీవ్రతతో సంభవించిన పెను భూకంపం నుంచి ప్రజలు ఇంకా కోలుకోకముందే తాజాగా మరోసారి ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇటీవలి విపత్తు కారణంగా 81 మంది ప్రాణాలు కోల్పోగా, 1,300 మందికి పైగా గాయపడ్డారు. సుమారు 16 లక్షల మంది ఈ ఘటనతో ప్రభావితులయ్యారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' జోన్‌లో ఉన్న ఫిలిప్పీన్స్‌లో ఇటువంటి భూకంపాలు సంభవించడం సర్వసాధారణం.

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, "రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి" అని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## త్రిశూల్ వ్యూహంలో ఎన్డీఏ

నాలుగోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. త్రిశూల వ్యూహంతో పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సర్, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తోంది. బీహార్, బెంగాల్‌లో అనుసరించిన ఫార్ములానే?2029 ఎన్నికల్లో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. ఇదే ఇవాళ్టి స్టోరీ బోర్డు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ఇక్కడ ఎన్నికలదే కీలక పాత్ర. అలాంటప్పుడు ఓటర్ల విషయంలో వారి అర్హతలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవటం చాలా అవసరం. ఈ ఉద్దేశంతోనే సర్ ప్రక్రియకు రూపకల్పన జరిగింది. కాకపోతే ఇప్పుడు జరుగుతున్నది సర్ కాదు ఓట్ల చోరీ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈసీ మాత్రం అవన్నీ అపోహలేనని కొట్టిపారేస్తోంది.దేశంలో ఓటర్ల జాబితాను అప్పుడప్పుడూ సవరించడం తప్పనిసరి. అర్హులకు చోటు కల్పించి అనర్హులపై వేటు వేసేందుకు సర్ నిర్వహించడమూ అవసరమే. దీని పై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండనవసరం లేదు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 పూర్తి స్వేచ్ఛను కల్పించింది. ఈసీ ఈ విషయం లో ఎవరి అనుమతి తీసుకోవాల్సిన లేదా ఎవరికీ జవాబుదారీ వహించాల్సిన అవసరం లేదు. దేశంలో ఇలాంటివి జరగడం ఇదే కొత్త కూడా కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సర్ జరిగింది. కానీ, ప్రస్తుత సర్వే స్థాయిలో అవేవీ వివాదాల్లో చిక్కుకోలేదు. అయితే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కొడిగట్టిన ప్రస్తుత తరుణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. సర్ పేరిట జరుగుతున్న తతంగమంతా బీజేపీకి సానుకూలత, విపక్షాలకు ప్రతికూలత కల్పించేందుకేనని, అందుకు కృత్రిమమైనరీతిలో చేర్పులు, ప్రక్షాళనలు జరుగుతున్నాయని ప్రధానమైన ఆరోపణ. పనిలోపనిగా పౌరసత్వ పరీక్షలూ జరుగుతున్నాయనేది మరో ఆరోపణ.దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం సర్వే చేపట్టింది. అందులోనూ మొదటి విడతగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించడంపై ఇప్పటికే తీవ్ర దుమారం చెలరేగింది. మార్పుల తర్వాత జాబితాలో 50 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు గల్లంతు కావడంపై పార్లమెంటు కూడా దద్దరిల్లింది. ఈ వివాదం ఒక కొలిక్కి రాకుండానే దేశమంతటా సర్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎన్నికల కమిషన్ గత అక్టోబర్ 27న ప్రకటించింది. దీనిపై విపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత తెలిపాయి. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రతిఘటించి తీరుతామని శపథం పూనాయి. కానీ తీవ్ర నిరసనల మధ్యే సర్ ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల్లో తమ ఓటమికి సర్ తోనే పునాది పడిందని బెంగాల్లో మమతా బెనర్జీ సుప్రీందాకా వెళ్లి మరీ ప్రతిఘటించారు. దీంతో సుప్రీంకోర్టు సర్ ప్రక్రియ కోసం జ్యుడీషియల్ అధికారులను నియమించింది. చివరకు వారిని కూడా ఘెరావ్ చేసే దుస్థితి రావడం, తమ ఆదేశాల్ని కూడా బెంగాల్ రాష్ట్ర యంత్రాంగం బేఖాతరు చేయడాన్ని సుప్రీం తీవ్రంగా పరిగణించింది. కేంద్ర బలగాల రక్షణలో సర్ జరగాల్సిందేనని, సర్‌కు ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే చూస్తూ ఊరుకునేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సర్ నిబంధనల మేరకు జరగకపోతే ఆధారాలతో ఫిర్యాదు చేయొచ్చు కానీ.. అసలు ప్రక్రియనే వద్దనడం పద్ధతి కాదని సర్వోన్నత న్యాయస్థానం పార్టీలకు తలంటింది.ఉత్తరప్రదేశ్ సర్‌లో ఏకంగా సుమారు 20 శాతం ఓటర్ల పేర్లు, అంటే 2.89 కోట్ల ఓట్లు గల్లంతవడం కలకలం రేపింది. రాష్ట్రంలోని మొత్తం ఓట్ల సంఖ్య 15.44 కోట్ల నుంచి 12.55 కోట్లకు తగ్గిపోయింది. ఇక రాజధాని లక్నోలో 39.9 లక్షల ఓట్లుంటే అందులో 30 శాతం సర్వేలో ఎగిరిపోయి చివరకు 27.9 లక్షలే మిగిలాయి. అందులో కొందరు ఓటర్లు చనిపోయారని, మరికొందరు వేరే ప్రాంతాలకు వలసపోయారని, ఇంకొందరి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువచోట్ల ఉన్నాయని కమిషన్ వివరణ ఇచ్చింది. ఏదేమైనప్పటికీ భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ కార్యక్రమం వల్ల ఓటర్లలో కొన్ని వర్గాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది.సర్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో తమిళనాడు న్యాయపోరాటానికి దిగింది. ఎన్నికల సంఘం చేపట్టిన సవరణకు ఎలాంటి రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత లేదని, పారదర్శకత, సమన్యాయం లోపించాయని ఆరోపించింది. బెంగాల్‌లో ఏకంగా నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌కు సర్ యంత్రాంగం విచారణ నోటీసు పంపించడంపై వివాదం రేగింది. దేశ విభజన నుంచి బంగ్లా యుద్ధం దాకా అనేక చారిత్రక కారణాల వల్ల బెంగాల్‌లో పౌరసత్వ సమస్యలున్నాయి. సర్ పేరిట దొడ్డిదారిన సిటిజన్‌షిప్ రిజిష్టర్‌ను ప్రవేశపెడుతున్నారని టీఎంసీ మండిపడింది. ఈ వివాదాల వెనుక నిజానిజాల మాట అటుంచితే, ప్రజలకూ, పార్టీలకూ సర్‌పై అంతులేనన్ని అనుమానాలున్నాయన్న మాట నిజం. పార్టీలు ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల సంఘంపై కూడా నమ్మకం ఉంచటం లేదు. అయితే బెంగాల్ సర్ విషయంలో అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అడిగితే.. ఏ పార్టీ నుంచీ స్పందన రాలేదు. కనీసం తుది జాబితాపై అభ్యంతరాలు అడిగినా.. ఎవరూ ముందుకు రాలేదు. తగినంత సమయం ఇచ్చిన తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో.. సర్‌ను రాజకీయ వివాదంగా మార్చొద్దని సుప్రీంకోర్టు చెప్పాల్సి వచ్చింది.

ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ.. సర్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను పీసీసీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉన్నందున ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా 2-3 నెలల్లో హడావిడిగా ముగించకుండా, ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని సూచించింది. సర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకోవడానికి గడువును 3 నెలలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే జనగణన ప్రక్రియ జరుగుతున్నందున దాంతోపాటే సర్ నిర్వహిస్తే.. సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళ కూడా ఉంది. బూత్ లెవెల్ అధికారులు ప్రత్యక్షంగా 3-4 సార్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు తనిఖీ చేయాలి. విదేశీయులు ఉన్నారనే నెపంతో ఓట్లు తొలగించే ప్రక్రియ సరికాదనే సూచనలు వస్తున్నాయి.ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం సర్ అవసరమే అనే వాదనతో అన్ని పార్టీలూ ఏకీభవిస్తున్నాయి. కానీ సర్ ప్రక్రియకు ఎంచుకుంటున్న సమయం, సందర్భంపై మాత్రం భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి.

ఇక్కడ అవకతవకలు ఉన్నాయా.. లేదా అనేది పక్కనపెడితే.. అసలు అనుమానాలు కలిగేలా ఎందుకు వ్యవహరించాలనే ప్రశ్నకు మాత్రం కచ్చితంగా జవాబు వెతకాల్సిందే. అటు పార్టీలు,ఇటు ఓటర్లు అందరిలోనూ నమ్మకం కలిగించే విధంగా ఈసీ విధానాలకు పదునుపెట్టాలనే సలహాలు వస్తున్నాయి. అనవసర ఆందోళనలు, వివాదాలకు తావివ్వకుండా.. ఎవ్వరూ వేలెత్తిచూపటానికి వీల్లేని విధంగా తెలుగు రాష్ట్రాల్లో సర్ జరగాలనే భావన వ్యక్తమవుతోంది. అయితే మన దగ్గర బీహార్, బెంగాల్ మాదిరి రగడకు ఆస్కారం లేదని, ఇక్కడ చాలావరకు ఓటర్లకు సరైన పత్రాలుంటాయనే అభిప్రాయాలు కూడా లేకపోలేదు.

# జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తాం.!

**-జర్నలిస్టులకు అండగా టియుడబ్ల్యూజే (ఐజేయు)**
**-జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం.**
**-జర్నలిస్టుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం**
**-అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం.: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**








**ఎమ్మెల్యే పాయం**

మణుగూరు, జూన్ 26 (భారతశక్తి): జర్నలిస్టుల సమస్యలు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టియుడబ్ల్యూజే (ఐజేయు) పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం అన్నారు. శుక్రవారం మణుగూరు కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో గల డివి ఫంక్షన్ హాల్ లో జరిగిన టియుడబ్ల్యూజే (ఐజేయు) పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశంలో ముఖ్యఅతిథులుగా జాతీయ కౌన్సిల్ సభ్యులు బివి రమణ రెడ్డి, జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి జానుమాల రమేష్ పాల్గొని ప్రసంగించారు. ముందుగా మణుగూరు, అశ్వాపురం మండలాలకు సంబంధించిన సీనియర్ జర్నలిస్టుల మృతికి మౌనం పాటిస్తూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై టియుడబ్ల్యూజే ఐజేయు నిరంతరం పోరాడుతుందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా వంటి సదుపాయాలు, అన్ని విధాలుగా అర్హతలు ఉండి కూడా అక్రిడేషన్ రాని వారికి అక్రిడేషన్ వచ్చేలా చూస్తామన్నారు. ముఖ్యంగా యూనియన్ తరపున ఇన్సూరెన్స్ భీమా ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. యూనియన్ బలోపేతం తోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఐకమత్యంగా ఉన్నప్పుడే జర్నలిస్టులు హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. జాతీయ కౌన్సిల్ సభ్యులు బివి రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే టియుడబ్ల్యూజే (ఐజేయు) అతి పెద్ద యూనియన్ అని జాతీయ కౌన్సిల్ సభ్యులు బివి రమణారెడ్డి ఉద్ఘాటించారు. జర్నలిస్టుల కోసం నిరంతరం పోరాటాలు చేసి తమ హక్కులు సాధించుకున్నట్లు గుర్తు చేశారు. చిన్న పెద్ద పత్రికల తారతమ్యం లేకుండా అందరితో మమేకమై కలం కార్మికుల అభివృద్ధికి దోహదపడి, సమస్యలను పరిష్కరించామని తెలియజేశారు.

**కార్యదర్శి జనుమాల రమేష్ మాట్లాడుతూ**

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడిన సంఘం టియుడబ్ల్యూజే ఐజేయు అన్నారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామని భరోసా ఇచ్చారు.

**జర్నలిస్టుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం:**

మణుగూరు మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచే జర్నలిజం ప్రజాస్వామ్య వ్యవస్థలో నాల్గోవ స్తంభంగా అభివర్ణించారు. అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే గతం లో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చిన ఘనత తమదేనని గుర్తు చేశారు. అలాగే ప్రస్తుతం అర్హత కలిగిన జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చేందుకు నియోజకవర్గంలోని తహశీల్దార్లకు నివేదికలు పంపించామని తెలిపారు. జర్నలిస్టులు సమాజానికి సేవ చేస్తున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అర్హత కల్గిన జర్నలిస్టులకు ప్రభుత్వం అందించే అక్రిడేషన్ కార్డులు రాకుంటే తమ దృష్టికి తీసుకువస్తే సంబంధించిన అధికారులతో మాట్లాడతానని తెలియజేశారు. అనంతరం ఐజేయు యూనియన్ నాయకులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్చాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ నియోజకవర్గ స్థాయి సమావేశంలో టియుడబ్ల్యూజే ఐజేయు నాయకులు, అన్ని మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

# గరిసెల కుంట అలుగు వెంటనే మరమ్మతు చేయాలి: చిట్యాల వీరన్న

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 26(భారత శక్తి):కేసముద్రం పట్టణంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ ప్రజల జీవనాధారమైన చెరువులు, కుంటలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తెలంగాణ వాచ్‌డాగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్యాల వీరన్న విమర్శించారు. శుక్రవారం కేసముద్రంలోని పెద్దాయి చెరువు కింద ఉన్న గరిసెల కుంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంట అలుగు(మత్తడి) తెగిపోయి రెండేళ్లు దాటినా మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అలుగు దెబ్బతినడంతో వర్షపు నీరు నిల్వ కాకుండా వృథాగా వెళ్లిపోతోందని, దీంతో రైతులకు, పరిసర గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుంటలో నీరు నిల్వ లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, సమీపంలోని బావులు, బోర్లు ఎండిపోతున్నాయని తెలిపారు. దీనివల్ల రైతులు సాగునీటి సమస్యతో పాటు తాగునీటి ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.



పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇలాంటి ప్రాథమిక అవసరాలపై కూడా దృష్టి సారించాలని వీరన్న కోరారు. వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో మరింత ఆలస్యం చేయకుండా గరిసెల కుంట అలుగుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని



పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖలు వెంటనే స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

# బోర్‌వెల్ ప్రారంభించిన కౌన్సిలర్ చిదిరాల అరుణ - జ్ఞానేశ్వర్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 26( భారత శక్తి ): ప్రజా సమస్యల కోసం నిత్యం గళం విప్పే పాత్రికేయ సోదరుల అవసరాన్ని గుర్తించి, మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ కాలనీలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను జర్నలిస్టుల ఆహ్వానం మేరకు 19వ వార్డు కౌన్సిలర్ చిదిరాల అరుణ -- జ్ఞానేశ్వర్ కొబ్బరికాయ కొట్టి, పసుపు--కుంకుమతో పూజలు నిర్వహించి, జర్నలిస్టులతో కలిసి ప్రారంభించి నీటి సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చారు.

**ఈ సందర్భంగా జర్నలిస్టులు కౌన్సిలర్ దంపతులకు ఘనంగా సన్మానం చేసి తమ కృతజ్ఞతలను తెలియజేశారు.**

అనంతరం జర్నలిస్టుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని వినతిపత్రాలను స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ అవి అందేలా కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ తరపున ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తామని కౌన్సిలర్ చిదిరాల అరుణ -- జ్ఞానేశ్వర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేసిడబుల్యూ అధ్యక్షులు కారు పోతుల రమేష్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, గౌరవ అధ్యక్షులు



ఉప్పల రంగ, బండారి రమణ, చందు, బిక్షపతి, మురళి, దేశభైనా ఉపేందర్ జెసి డబ్ల్యూ సభ్యులు , పురుషోత్తం, మహేష్, మోహన్, రవీంద్ర చారి, యాకాంబరం, విష్ణు, కిరణ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**28 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సిద్ధార్థ మోడల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు**

భారత శక్తి, జూన్ 26(యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట పట్టణంలోని సిద్ధార్థ మోడల్ హైస్కూల్ లో చదువుకున్న 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 28 సంవత్సరాల తర్వాత బుధవారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, చిన్ననాటి స్నేహాలను మరింత బలోపేతం చేసుకున్నారు. తమ జీవితానికి బాటలు వేసిన గురువులను స్మరించుకుంటూ వారికి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె కృష్ణమాచార్యులు, జి రాజు, బి మురళీధర్ శర్మ, ఎం రామాచార్యులు, కె ఉపేందర్ లను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ, జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తూ, తమ పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని 28 సంవత్సరాల అనంతరం ఒకరినొకరు కలుసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.



## వేములవాడ మాజీ ఎస్ హెచ్ఓ

# ఇంట్లో ఏసీబీ సోదాలు

**- రూ. 87.44 లక్షల అక్రమాస్తులు లభ్యం.**

**అధికార దుర్వినియోగంతో ఆస్తుల కూడిక**

**: కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ ఇల్లే లక్ష్యంగా తనిఖీలు.**

**భారీగా నగదు, ప్లాట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.**

కరీంనగర్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 26: కరీంనగర్ అర్బన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండెటి రాము (42) పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కింద అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. గతంలో వేములవాడ ఎక్సైజ్ స్టేషన్ ఎస్ హెచ్ఓగా విధులు నిర్వహించిన ఆయన, తన సర్వీస్ కాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమ మార్గాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టారనే నమ్మదగిన సమాచారంతో ఈ నెల 24న ఏసీబీ అధికారులు ఈ కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాది మార్చి 17న నమోదైన క్రిమినల్ దుష్ప్రవర్తన కేసు (జతీ. చీశీ. 05/RCO-ACB-KNR/2026) ఆధారంగా జగిత్యాలలోని భవానీ నగర్‌లో ఉన్న ఆయన అద్దె ఇంట్లో (ఇంటి నంబర్: 4-2/7/9) అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడి ఎస్‌బీఐ ఖాతాలో రూ. 29,88,317/- నగదు, ఆయన తండ్రి యూబీఐ ఖాతాలో రూ. 16,77,978/- బ్యాంక్ నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు ఇంట్లో రూ. 20,67,850/- చేతి నగదు, రూ. 11,97,000/- విలువైన ఇతర సామాగ్రి లభించాయి. అలాగే కరీంనగర్ పట్టణంలో రూ. 6,05,000/- విలువైన ఒక ఓపెన్ ప్లాట్, సిరిసిల్లలో రూ. 2,18,484/- విలువైన కమర్షియల్ ల్యాండ్‌కు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దస్తావేజుల ప్రకారం వీటి మొత్తం విలువ రూ. 87,44,629/- గా తేలినప్పటికీ, బహిరంగ మార్కెట్లో వీటి విలువ చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కేసులో మరిన్ని సోదాలు, లోతైన దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు లేదా వాట్సాప్ (9440446106) ద్వారా సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడతాయని అధికారులు స్పష్టం చేశారు.

# కుభీర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన డీఆర్‌డీవో విజయలక్ష్మి.




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 26 (భారత శక్తి )కుభీర్ ప్రభుత్వ ఆసుపత్రిని డీఆర్‌డీవో విజయలక్ష్మి సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమావేశమై వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవడం, మరిగించిన లేదా శుద్ధి చేసిన తాగునీటినే వినియోగించడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని వివరించారు.జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు. వర్షాకాలంలో ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయినాథ్, ఏపీఓ హరిలాల్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నేత ఆవుల సర్వేశ్వరరావు



మణుగూరు, జూన్ 26 (భారతశక్తి): మండల పరిధిలోని రామానుజవరం పంచాయితీ లో గల 85 బూత్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) -2026 ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహిస్తున్న అధికారులతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆవుల సర్వేశ్వరరావు పాల్గొన్నారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సర్వేలో పాల్గొన్నామని తెలిపారు. రామానుజవరం పంచాయితీలోని 85 బూత్ లో గల ఓటరు జాబితా ప్రకారం ప్రతి ఒక్క ఓటును తొలగించకుండా, తప్పులు దొర్లకుండా పారదర్శకంగా సర్వే చేస్తున్న సిబ్బందితో ఇంటింటికీ తిరిగామని తెలిపారు. పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా సంబంధిత అధికారులు చేపడుతున్నారని సర్వేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది బి ఎల్ఓ శివకృష్ణ, బిఎల్ఏలు నరసింహారావు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి పిటిషన్ల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 26 (భారత శక్తి)జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల పురోగతిపై జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను ప్రత్యేకంగా సమీక్షించి, వాటి విచారణను వేగవంతం చేయాలని సూచించారు.ప్రతి ప్రజావాణి పిటిషన్‌పై ఎప్పటికప్పుడు ఫాలోఅప్ నిర్వహించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజావాణి కార్యక్రమం కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, సూచించారు.

## టియుడబ్ల్యూజే (ఐజేయు) పినపాక

# నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

**-అధ్యక్ష,కార్యదర్శులుగా పిండిగ వెంకట్, బర్ల జోషి**





మణుగూరు, జూన్ 26 (భారతశక్తి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టియుడబ్ల్యూజే (ఐజేయు) పినపాక నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం మణుగూరులోని అంబేద్కర్ సెంటర్ లో గల డివిఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జాతీయ కౌన్సిల్ సభ్యులు బివి రమణ రెడ్డి, జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జానుమాల రమేష్ ల సమక్షంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల వివరాలను జిల్లా కార్యవర్గ సభ్యులు పూజారి చందు అధికారికంగా వెల్లడించారు. పినపాక నియోజకవర్గం ప్రింట్ మీడియా నూతన కమిటీ అధ్యక్షులుగా పిండిగ వెంకట్ (వార్త), కార్యదర్శిగా బర్ల జోషి (ప్రజాపక్షం), ఉపాధ్యక్షులుగా మహేష్ రెడ్డి (సాక్షి), యదారి శివరామకృష్ణ (తెలంగాణ వాణి), తిప్పని శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి,) గౌరవ సలహాదారులుగా వంగూరి నాగేశ్వరరావు (ప్రజాపక్షం), కోశాధికారిగా సనప భరత్ (ఆంధ్రప్రభ), సహాయ కార్యదర్శిగా కనుకు రమేష్ (భారతశక్తి),కమిటీ సభ్యులుగా శ్రీరామ్ బృహస్పతి (నవతెలంగాణ), కొల్లు నాగేశ్వరరావు (మెట్రో ఈవినింగ్), పి. నర్సింహారెడ్డి (మన భద్రాద్రి), అంజం యాకన్న (విశాలాంధ్ర), నక్క సురేష్ (మీడియా టుడే), వుల్లోజు బాబూరావు (దిశ), జిల్లపల్లి ఓం ప్రకాష్. అలాగే పినపాక నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ అధ్యక్షులుగా పంపన రమేష్ (10 టివి),కార్యదర్శిగా జిన్నె ఉపేందర్ (రాజ్ న్యూస్),కోశాధికారిగా రవి కిరణ్ (ఐ న్యూస్),సహాయ కార్యదర్శిగా మర్రి సాంబిరెడ్డి (ప్రైమ్ 9 న్యూస్),ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గుర్రం రవి (హెచ్ఎమ్ టివి), దాసరి వెంకట్ (బిగ్ టివి), ఈ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు, పలువురు ప్రముఖులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ నిరంతరం కృషి చేస్తుందని ఎన్నికైన ప్రతినిధులు తెలిపారు.

# ఏజెన్సీలో ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి.

**-ప్రవేట్ స్కూళ్ల విద్యా దోపిడీపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించాలి.**

**-రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్**



మణుగూరు, జూన్ 26 (భారతశక్తి): ఏజెన్సీ ప్రాంతంలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రవేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను జలగల్లా పీడిస్తున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీ నుండి వేలల్లో ఫీజులు వసూలు చేయడమే కాకుండా, పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బ్యాగులు, ఇతర విద్యా సామగ్రిని కూడా పాఠశాలల ద్వారానే తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ తల్లిదండ్రులపై లక్షల రూపాయల అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, ప్రచార కరపత్రాల్లో మాత్రం అత్యాధునిక సౌకర్యాలు ఉన్నట్లు చూపిస్తూ తల్లిదండ్రులను, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తును అడ్డం పెట్టుకుని అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని పేద, గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్వయంగా జోక్యం చేసుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమ ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. విద్య సేవ కావాలే గాని విద్యతో వ్యాపారం చేయొద్దని ఆమె సూచించారు. పిల్లల భవిష్యత్తును పెట్టుబడిగా మార్చుకుని తల్లిదండ్రులను దోచుకునే విద్యా మాఫియాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులతో పాటు ప్రతి కార్యక్రమం పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే, రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయం ఎదుట దశలవారీగా ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండి షబానా, బొడ్డు సౌజన్య, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, డేరంగుల సుజాత, బాడిష పార్వతి, లక్కింశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో రోడ్డు ప్రమాదం, కారును ఢీకొట్టిన బైక్..

**ఇద్దరికి విరిగిన కాళ్ళు**

భారత శక్తి న్యూస్,భారత శక్తి ప్రతినిధి, జూన్ 26: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రఘుడు ఎల్లమ్మ గుడి సమీపంలో శుక్రవారం ఒక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రధాన రహదారిపై వెళ్తున్న ఒక మారుతి కారును వెనుక నుండి అతివేగంగా వచ్చిన మోటార్ సైకిల్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో వారిద్దరి కాళ్లు విరిగిపోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే క్షతగాత్రులుగా పడిపోయారు. ఈ సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. స్థానిక పోలీసులు చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ హైకోర్టు సబార్డినేట్ గా పనిచేస్తున్న ఉద్యమకారునికి సన్మానం



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 26(భారత శక్తి):తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పని చేసి తెలంగాణ హైకోర్టు సబార్డినేట్ గా పనిచేస్తున్న కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రంకు చెందిన కముటం కుమారస్వామిని శుక్రవారం కేసముద్రం బిఆర్ఎస్ మండల కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో 2001 లో కమటం కుమారస్వామి తమ వంతు కర్తవ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సబార్డినేట్ సర్వీసెస్ రాత పరీక్షలలో పరీక్ష రాసి తెలంగాణ హైకోర్టు సబర్డినేట్ సర్వీసెస్ కు ఎంపికయ్యారని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మాసాడి శ్రీనివాస్, కముటం శ్రీరంగం, హరి రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తరాలు మారినా తలరాతలు మారని గీత కార్మికులు

**ప్రభుత్వాలు మారినా ఆగని గీత కార్మికుల చావులు**

**గీత వృత్తి జీవనాధారం.... గాలిలో దీపం గీతన్నల ప్రాణం**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 26(భారత శక్తి):గత రెండున్నర సంవత్సరాలుగా తాటిచెట్టుపై నుండి పడి మరణించిన, అంగవైకల్యం పాలైన వందలాది గీత కార్మికులకు నేటికీ నష్టపరిహారం అందలేదనీ, ఇంకా ఎంతకాలం ఎదురుచూపులు తప్పవని కేజీకేఎస్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం కేసముద్రం మండలంలో ఒక ప్రకటనలో మాట్లాడుతూ తరాలు మారినా గీత కార్మికుల తలరాతలు మారలేదని, ప్రభుత్వాలు మారినా గీత కార్మికుల చావులు ఆగడంలేదని, చివరికి గీత వృత్తి జీవనాధారంగా బ్రతుకుతున్న గీత కార్మికుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయన్నారు. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబం వీధిన పడి, బ్రతుకు ఛిద్రమై, పిల్లల చదువులు భారమై, ఇంటి ఖర్చులు కూడా వెళ్లదీయలేక గీత కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకో ప్రాణం గాలిలో కలిసిపోతున్నా, రెండు రోజులకొకరు కాళ్లు, చేతులు, నడుములు విరిగి మూలన పడుతున్నా ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు ఏమాత్రం పట్టడం లేదని విమర్శించారు.

**కాంగ్రెస్ ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయి?**

1."మా ప్రభుత్వం వస్తే 5 లక్షల నష్టపరిహారం 10 లక్షలు చేస్తాం" అన్నారు.
2."రూ.2000 ఉన్న గౌడన్న పెన్షన్ రూ.4000 చేస్తాం" అన్నారు.
3."రూ.4000 ఉన్న పెన్షన్ రూ.6000 చేస్తాం" అన్నారు. ఓట్లు వేయించుకొని గెలిచి గద్దెనెక్కిన తర్వాత మర్చిపోయారా? "ప్రజా ప్రభుత్వం వచ్చింది, మార్పు వచ్చింది" అని చెప్పుకుంటున్నారు. మార్పు అంటే చెప్పినవి చేయకపోవడం? వాగ్దానాలు మర్చిపోవడమేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇదే చేసింది. మరి మీరు కూడా అదే చేస్తే మిమ్మల్ని ఏమనాలి? చెప్పింది చేయరు, చెప్పనివి బడ్జెట్‌లో పెడతారంటూ ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు.

**గీత కార్మికులకు నెరవేర్చాల్సిన డిమాండ్లు:**

1.చెట్టుపై నుండి పడి చనిపోయిన, అంగవైకల్యం అయిన ప్రతి గీత కార్మికుడికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
2.గౌడన్న పెన్షన్ రూ.6000 వెంటనే అమలు చేయాలి.
3.గీత కార్మికులకు ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు

**విజయవాడ,(భారత శక్తి)** ఏపీలో సంచలనంగా మారుతోంది సాయి కృష్ణ లాకప్ డెత్ మిస్టరీ. ఇప్పటికే వైసీపీ నేతలు కుల రాజకీయం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా, రాజకీయంగా, కుల పరంగా టార్గెట్ చేశారు. అదృశ్యం తరహాలో కేసు విచారణ మొదలుపెట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇందుకు ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజును అదుపులోకి తీసుకుంది. అయితే సాయి కృష్ణ మిస్సింగ్ మిస్టరీ కాస్త లాకప్ డెత్ గా బయటపడింది. సీఐ రిమాండ్ రిపోర్టులో అత్యా అని తేల్చేసింది సిట్. పోలీస్ కస్టడీలో తగిలిన గాయాల వల్లే సాయి కృష్ణ మరణం సంభవించిందని నిర్ధారించింది. దీంతో కుటుంబ సభ్యుల అనుమానాలు నిజమయ్యాయి. అయితే సాయి కృష్ణ మృతదేహాన్ని ఖననం చేశారా? లేకుంటే ఎక్కడైనా విడిచి పెట్టారా? అన్నది తెలియాల్సి ఉంది.అయితే సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని చంపేశారు అంటూ ఆది నుంచి ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఆనవాళ్లు, అనుమానాలు ఉండడంతో పాటు సంకేతాలు రావడంతోనే ఆమె ఆ తరహా ఆరోపణలు చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. సాయి కృష్ణ మే 6న మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ సిబ్బందికి పట్టుబడ్డారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడే నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు అర్థం అవుతుంది. మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పూర్తిగా మాయమైంది. అయితే ఇప్పటివరకు అదృశ్యం కేసు గానే ఉండేది. ఇప్పుడు లాకప్ డె×త్ అని తెలియడంతో దాని వెనుక జరిగిన పరిణామాలపై అసలు సిసలైన విచారణ మొదలుకానుంది.అసలు సాయి కృష్ణ పై మోపిన అభియోగాలు ఏంటి? ఏ కేసులో టాస్క్ ఫోర్స్ పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు సీఐ నాగరాజుకు సరెండర్ చేసిన తర్వాత ఏం జరిగింది? అసలు లాకప్ డెత్ చేయాల్సిన అవసరం సిఐ నాగరాజుకు ఎందుకు వచ్చింది? దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? లేకుంటే పెద్దల పాత్ర వుందా? ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచకుండా ఎందుకలా చేశారు? అన్నింటికీ మించి సాయి కృష్ణ మృతదేహం ఇప్పుడు ఎక్కడ ఉంది? ఖననం చేశారా? దహనం చేశారా? లేకుంటే ఎక్కడైనా పారవేశారా? అనేది ఇప్పుడు రెండో చార్ట్ షీట్లో తప్పకుండా వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే ఈ కేసు వెనుక ఏం జరిగిందనే దానిపై పోలీసు వర్గాలకు ఇప్పటికే ఒక స్పష్టత ఉంది. ఎందుకంటే మృతుడు సాయి కృష్ణకు నేరచరిత ఉంది. అయితే నేరస్తులంతా లాకప్ డె×త్ చేస్తామంటే కుదరదు. అయితే ఈ స్థాయికి పరిస్థితి వచ్చింది అంటే తెర వెనుక ఏం జరిగింది అనేది ఇప్పుడు కచ్చితంగా బయటపడుతుంది. అంతవరకు వేచి చూడాల్సిందే.

## సింగపూర్‌కు సముద్రమార్గంలో బంగినపల్లి

**విజయవాడ,(భారత శక్తి)** దేశీయ వ్యవసాయ రంగ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఒక కీలక మైలురాయి నమోదయ్యింది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను వాణిజ్యపరంగా తొలిసారి సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా పంపారు. దీంతో తక్కువ ఖర్చు, పర్యావరణ హితంగా తాజా పండ్లను ప్రపంచ మార్కెట్లకు చేర్చేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియను వ్యవసాయ, శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి పర్యవేక్షించింది. ఇందులో భాగంగా జూన్ 11న ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను ఎగుమతి చేయగా.. ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ చేరుకుంది. ఈ ఎగుమతి ప్రక్రియ విజయవంతం కావడం వెనుక లక్నోలోని ఐకార్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ కీలక పాత్ర పోషించింది.ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి సేకరించిన మామిడి పండ్లను.. కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి ద్వారా రైతులకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. స్థానిక మార్కెట్‌లో మామిడి కిలో రూ. 25- రూ. 26 పలుకుతోంది. కానీ, సింగ్‌పూర్‌కు ఎగుమతి చేయడం ద్వారా కిలోకు సుమారు రూ. 50 వరకు లభించింది. దీంతో రైతుల ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది.అలాగే, ఈ మామిడి పండ్లను దిగుమతి చేసుకున్న సింగూర్ సంస్థ ఈసీ-లింక్స్ లిమిటెడ్.. నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తియ్యదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ ప్రమాణాలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకోవడం హర్షణీయం. శాస్త్రీయ విధానాల్లో మామిడి కోత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సముద్ర రవాణాలో కోల్డ్-చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది.బంగినపల్లి మామిడి పండు తన బంగారు పసుపు వర్ణం, పీచులేని గుజ్జు, చక్కటి సువాసన, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఇక, జలమార్గం ద్వారా ఎగుమతి ఖర్చు వాయు మార్గంతో పోలిస్తే తక్కువకావడమే కాదు, పర్యావరణ హితమైందని, వాణిజ్యపరంగా లాభదాయకమైందని రుజువు చేసింది. అలాగే, శక్తిమంతమైన కోల్డ్-చైన్ మౌలిక సౌకర్యాలు, శాస్త్రీయ నిర్వహణ విధానాల సహకారంతో సముద్ర మార్గాల ద్వారా రవాణా భారత ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా తగినంత గుర్తింపు తీసుకురావడం అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను జల మార్గంలో ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

## విద్యుత్ వైర్లు కట్ చేస్తున్న గంజాయి బ్యాచ్

**గుంటూరు,(భారత శక్తి)** గుంటూరు నగరంలోని ముస్లిం కాలేజ్ ప్రాంతం.. 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో స్థానికుల నుండి వరుస పోన్లు వచ్చాయి. అర్ధరాత్రి సమయంలో పెదకాకాని పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో వరుసగా ఫోన్లు వస్తున్నట్టు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు సిబ్బంది హుటాహుటిన ఆ సబ్ స్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్య వచ్చింది చూసి వెంటనే పరిష్కరించారు. ఇదే తరహాలో వారం రోజుల క్రితం రామిరెడ్డి తోట పరిధిలో కూడా అర్ధరాత్రి సమయంలో పవర్ నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇలా వరుసగా జరుగుతంతో విద్యుత్ శాఖాధికారులు ఆలోచనలో పడ్డారు. అసలు ఏంజరిగి ఉంటుందా అని లైన్లు పరిశీలించారు. వర్షం లేదు, ఈదురు గాలులు లేవు అయినా ఎందుకు అంతరాయం వస్తుందో పరిశీలించిన అధికారులకు ఆశ్చర్యపోయే పరిణామం కొన్ని కనిపించాయి.పొలాలలో తీగలకు రాళ్లు ..లేదా ఇతర వస్తువులను కట్టిన గంజాయి బ్యాచ్ లు అర్ధరాత్రి సమయంలో వాటిని విద్యుత్ లైన్ల పైకి విసురుతున్నట్లు గుర్తించారు. ఐరన్ తీగలకు రాళ్లు కట్టి విసరడంతో అవి సులభంగా విద్యుత్ వైర్లపై పడుతున్నాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. విద్యుత్ లైన్ల పై గంజాయి బ్యాచ్ లు ఆ విధంగా విసిరిన ఐరన్ తీగలను గుర్తించిన విద్యుత్ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకున్నారు. వరుసగా ఈ తరహా ఘటనలు జరగడంపై విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఎస్ ఈ చల్లా రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటువంటి ఘటనలతో ఆర్థిక నష్టంతో పాటు ప్రజల భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రమేష్ తెలిపారు.

## పంచముఖ సంకటహర రూపంలో..మహాగణపతి

**హైదరాబాద్,(భారత శక్తి)** ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణపతి 69 అడుగుల ఎత్తులో రూపొందించనున్నారు. పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో ఖైరతాబాద్ మహా గణేషుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇక ఆ విగ్రహానికి ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం.. మరోవైపు కాశీమాత విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఈసారితో ఖైరతాబాద్ ఉత్సవాలకు 72 ఏళ్ళ పూర్తి కానున్నాయి. సెప్టెంబర్ 14న వినాయక చవితి జరగనుండగా.. తాజాగా కర్ర పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రసిద్ధి చెందిన వినాయక మండపాల్లో ఒకటైన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహా గణేశుడి ఉత్సవాల నేటితో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. తాజాగా ఈసారి ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే మహా గణపతి నమూనా పోస్టర్‌ను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఇవాళ ఆవిష్కరించింది. ఈ క్రమంలోనే ఘనంగా కర్రపూజను నిర్వహించారు. ఈసారి 69 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని.. పంచముఖ సంకటహర మహా గణపతి రూపంలో తయారు చేయనున్నారు. ఈ విగ్రహ నిర్మాణం పూర్తి కావడానికి 82 రోజులు పట్టనుంది. ఈసారి ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహంలో సోమనాథ్ జ్యోతిర్లింగం, కాశీమాత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రోజున ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా కర్రపూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

దీంతో ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలు అంకురార్పణ జరిగినట్లయింది. ఈ పూజా తర్వాత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఈ ఏడాది అక్కడ కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు.వినాయక చవితి ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన రానుండగా.. నేటితో సరిగ్గా 82 రోజులు మిగిలి ఉన్నాయి. దీంతో ఈ 82 రోజుల్లోనే సర్వ హంగులతో కూడిన 69 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని.. ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇక ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు.. ఉద్రిక్తతలు తగ్గిపోయి.. అన్ని దేశాల్లో శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈసారి ఖైరతాబాద్ గణేశుడిని పంచముఖ సంకటహర మహా గణపతి రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెల్పి చెప్పారు. ఈ భారీ వినాయకుడి విగ్రహానికి కుడివైపున ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# టీడీపీలో తమ్ముళ్ల తగాదాలు

**నెల్లూరు,(భారత శక్తి)** నెల్లూరు జిల్లా ఉదయగిరి టిడిపిలో ఇంటర్నల్‌గా రీ సౌండ్స్ వస్తున్నాయట. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం రీ యూనియన్ అవుతున్నట్టు తెలుస్తోంది. పాత తరం పార్టీ నేతలకు, ఎమ్మెల్యేకి మధ్య బాగా గ్యాప్ పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. వరుస భూ వివాదాలు కాకర్ల మెడకు చుట్టుకుంటున్నాయట. అనుచరులు చేసే తప్పులకు కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడం ఎమ్మెల్యేకి తలనొప్పిగా మారుతోందంటున్నారు. ఆయన వ్యవహార శైలి నచ్చని పాత తరం టిడిపి నేతలందరూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకి టచ్‌లోకి వెళ్తున్నట్టు తెలుస్తోంది. మండలాల్లో తమకేం పనులు జరగడంలేదని.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం ఎమ్మెల్యే మనుషులు చెప్పినట్టే పనిచేస్తున్నారంటూ సీనియర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. 2024 ఎన్నికలకు ముందు ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా బొల్లినేని రామారావు ఉన్నారు. అయితే ఫైనల్‌గా ఆయన్ని కాదని టీడీపీ అధిష్టానం ఎన్నారై కాకర్ల సురేష్‌కు మొదటి లిస్ట్‌లోనే అవకాశం కల్పించింది. అప్పటి వరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేసిన సురేష్.. అన్ని వర్గాలను కలుపుకొని జనంలోకి వెళ్ళి ఫస్ట్ అటెంప్ట్‌లోనే విజయం సాధించారు. కానీ? గెలిచాక వైఖరి మారిందన్నది స్థానికంగా వినిపిస్తున్న మాట. వరుస వివాదాలు చుట్టు ముడుతుండగా? అటు బొల్లినేని వర్గాన్ని సైతం దూరం పెట్టేశారన్నది కేడర్ చెబుతున్న మాట. తన వర్గాన్ని దూరం పెట్టినా? బొల్లినేని రామారావు పెద్దగా రియాక్ట్ అవకుండా, నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టకుండా.. నెలకోసారి తన వాళ్ళని కలుస్తున్నారు.ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ చర్చ ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక వివాహానికి మాజీ ఎమ్మెల్యే వెళ్ళగా.. అదే పెళ్ళికి ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పాతతరం టీడీపీ నేతలు, పలువురు మండలాధ్యక్షులు హాజరయ్యారు. వాళ్ళంతా కలిసి అప్పుడు ఎమ్మెల్యే మీదున్న అసంతృప్తిని బొల్లినేని దగ్గర వెళ్ళగక్కినట్టు తెలిసింది. కాకర్ల తమను పట్టించుకోవడంలేదని, ఒక సిఐ తో పాటు పలువురు అధికారులను మార్చాలని కోరినా.. చేద్దాం చూద్దామనే మాటలే తప్ప పని జరగడం లేదని వాపోయారట. పోలీస్ స్టేషన్లతో పాటు మండల కార్యాలయాల్లో కూడా తమకు పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. అలాగే?. ప్రజలకు, ఎమ్మెల్యేకి మధ్య గ్యాప్ పెరిగిపోవడం వల్లే.. పార్టీకి మైలేజ్ రావడం లేదని అంతర్గతంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరిలో ఎమ్మెల్యే పేరు చెప్పుకొని గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోందని, పార్టీకి అది పెద్ద డ్యామేజ్ అంటూ చెప్పుకొచ్చారట. ఓ సీఐ వ్యవహార శైలి కూడా ఎమ్మెల్యే కాకర్ల కు చెడ్డ పేరు తీసుకొచ్చేలా ఉందన్నది సీనియర్స్ వాయిస్. నక్కలగండి రిజర్వాయర్ లో ఉండే మత్స్య సంపదను ప్రైవేట్ వ్యక్తులు కాజేస్తుంటే ఎమ్మెల్యే కనీసం పట్టించుకోలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ పోలీస్ అధికారి పర్యవేక్షణలో ఈ చేపల దందా సాగుతోందట. ఈ వ్యవహారం ఎమ్మెల్యే కి తెలుసా లేదా అనే అనుమానాలను స్థానిక టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడసలు నియోజకవర్గంలో ప్రతిపక్షం బలంగా ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్న చర్చ కూడా నేతల మధ్య జరిగిందట. ఈ పరిస్థితుల్లో ఉదయగిరి నియోజకవర్గంలో మళ్లీ యాక్టివ్ అవ్వాలని బొల్లినేని రామారావును పాత తరం టీడీపీ నేతలు కోరినట్టు తెలిసింది. ప్రస్తుతం పార్టీ సెంట్రల్ ఆఫీసులోని గ్రీవెన్స్ సెల్‌లో జాతీయ ఉపాధ్యక్షుడి హోదాలో పని చేస్తున్నారు బొల్లినేని రామారావు. ఇక నుంచి ఉదయగిరి నియోజకవర్గ రాజకీయాలపై కూడా దృష్టి పెట్టాలని కోరారట స్థానిక నేతలు. మరోవైపు ఎమ్మెల్యే కాకర్ల సురేష్? ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో సన్నిహితంగా ఉండే వాళ్ళని కూడా దూరం పెడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ జిల్లా అధ్యక్షులకు చెప్పలేక, దూరం పెడుతున్న ఎమ్మెల్యేకి దగ్గర అవ్వలేక కొందరు టీడీపీ సీనియర్స్ సతమతమవుతున్నారట. గతంలో ఎమ్మెల్యేకి దగ్గరగా ఉన్న ఒకరిద్దరు నేతలు కూడా ఇప్పుడు బొల్లినేనికి టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సీఎం చంద్రబాబు హెచ్చరికల తర్వాత ఎమ్మెల్యేలో మార్పు వస్తుందని అందరూ భావించారని, కానీ ప్రస్తుతం అలాంటిదేమీ కనిపించడం లేదని సొంత నేతలే చెబుతున్నారు. వైసీపీ నుంచి వచ్చిన ఒకరిద్దరు నేతలకి ప్రాధాన్యం ఇస్తున్నారని.. తమను పట్టించుకోవడంలేదని పాత తరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రాబోయే రోజుల్లో మెట్ట ప్రాంత నియోజకవర్గ రాజకీయం రసకందాయంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం.

# శత్రువులుగా మిత్రపార్టీలు

**ఏలూరు,(భారత శక్తి)** కాపు కులం కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణాలు ఆయన్ని ఇరకాటంలో పడేస్తున్నాయంటున్నారు. ఇటీవల వైసీపీ కాపు నేతలంతా కలిసి మీటింగ్ పెట్టుకున్నాక జరుగుతున్న పరిణామాల మీద, పార్టీ తరపున కౌంటర్స్ వేసేందుకు ముందుండమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేని ఆదేశించిందట జనసేన అధిష్టానం. అందుకు తగ్గట్టే ప్రత్యర్థుల్ని అదీకూడా సొంత సామాజికవర్గానికి చెందిన వాళ్ళని గట్టిగానే టార్గెట్ చేస్తున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అలాగే? ఆయన ఏం మాట్లాడినా వెంటనే వైసీపీ కాపు నేతల వైపునుంచి రివర్స్ పంచ్‌లు కూడా స్ట్రాంగ్‌గా పడుతున్నాయి. దీంతో బొలిశెట్టి బాగా ఫీలవుతున్నట్టు తెలుస్తోంది.రాష్ట్రంలో చాలామంది జనసేన నాయకులు ఉన్నప్పటికీ? ప్రతిపక్ష నేతల్ని, ప్రత్యేకించి కాపు సామాజిక వర్గ నేతలను ఎదుర్కోవడం ఓ రకంగా ఇబ్బందికరమేనని భావిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యే అయ్యానన్న ఆనందంకంటే ఇదెక్కడి పొలిటికల్ కులగోల అన్న అసహనమే పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు సొంత నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనతో కలిసి పని చేయడానికి ముందుకు రాకపోగా ఇమేజ్‌ని డామేజ్ చేయడానికి చేస్తున్నారట. అందుకే శత్రువులుగా మారిన మిత్ర పార్టీ నేతలతో పోరాడడానికే రెండేళ్లు సరిపోయిందంటూ ఏ వేదికల మీద బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారాయన. కలిసి పని చేయండని రెండు పార్టీల అధిష్టానాలు ఆదేశిస్తున్నాతాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులు మాత్రం జనసేనతో కలిసి ముందుకెళ్లేందుకు ససేమిరా అంటున్నారన్నది ఎమ్మెల్యే మాట. పైగా ఎమ్మెల్యే ఎంతో మేమూ అంతేనన్నట్టుగా టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జీ వ్యవహరిస్తున్నారన్నది బొలిశెట్టి వర్గం కంప్లయింట్. ఇలాంటి సమయంలో వైసీపీని ఏకిపారేయాల్సి రావడం అదనపు తలనొప్పిగా మారిందన్నది ఆయన సన్నిహితుల మాట. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మాటల తూటాలు సరిగ్గా టార్గెట్ చేరితే సరే.. ఎక్కడైనా రివర్స్ అయిందంటే అసలుకే ఎసరు వచ్చి సొంత కులం వాళ్ళకే తాను టార్గెట్ అవుతానన్న భయం కూడా బొలిశెట్టిని వెంటాడుతోందట.దాంతో అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూనే.. కాపు కులానికి చెందిన ప్రత్యర్థుల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోందని, ఫైనల్‌గా అందరి టార్గెట్ నేనే అవుతానా అన్న అనుమానం సైతం ఆయన్ని వెంటాడుతోందట. మిత్ర పార్టీ నేతలతో ఇంట గెలిచేందుకు ఇప్పటికే నానా తంటాలు పడుతుంటే.. ఇప్పుడు రచ్చ గెలవాల్సిన అనివార్యత ఎదురవుతోంది. ఇదే విషయాన్ని చెబుతూ?. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తనను బాహుబలి అని ఎందుకు పిలిచారో ఇప్పుడు అర్థమవుతోందని సన్నిహితుల దగ్గర సెటైర్లు సైతం వేస్తున్నారట ఎమ్మెల్యే. రోజు రోజుకి కాక పెంచుతున్న జనసేన వర్సెస్ వైసీపీ రాజకీయం ఒకవైపు, తాడేపల్లిగూడెంలో టిడిపి వర్సెస్ జనసేన ఫైట్‌లో ఎవరు కట్టప్పలవుతారో అర్థం కాని అయోమయం మరోవైపు కలగలిసి తీవ్ర గందరగోళంలో ఉన్నారట శ్రీనివాస్. దీంతో కూటమిలోని ఇబ్బందులేంటో తన దాకా వస్తేగానీ? ఎమ్మెల్యేకి తెలియడం లేదా? ఇప్పటికైనా మా బాధలేంటో అర్థం చేసుకోండని కింది స్థాయి నాయకులు సూటిపోటి మాటలు అంటున్నారట. అలా మొత్తం మీద మా ఎమ్మెల్యే గట్టిగానే ఇరుక్కున్నారన్నది తాడేపల్లిగూడెం టాక్.

# రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి



**హైదరాబాద్(భారత శక్తి)** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 07:25 గంటలకు, ఏఎంబీ ఫ్లైఓవర్పై రోడ్డు ప్రమాదం జరిగింది. గచ్చిబౌలి నుండి హాఫీజ్పేట్ వైపు వెళు_న్న రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్సైకిల్ హాఫీజ్పేట్ నుండి గచ్చిబౌలి వైపు రోడ్ రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న శ్రీకాంత్, వెనుక కూర్చున్న విట్టల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మరణించారు. రాయల్ ఎన్ఫీల్డ్ రైడర్ వినోద్కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం మేరకు సమీపంలో ఉన్న హాస్పిటల్ తరలించారు కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాలు సేకరిస్తున్నమని తెలిపారు

# భీమిలి నుంచి తేజస్విని

**విశాఖపట్టణం(భారత శక్తి)** భీమిలీ నియోజకవర్గం విశాఖలో అతి ముఖ్యమైన సీటు. భీమిలీ స్వీట్ సీట్ అని కూడా అంటారు. టీడీపీకి కంచుకోట భీమిలీ. అత్యధిక సార్లు టీడీపీ అభ్యర్థులే గెలిచారు. ఇక ఇటీవల కాలంలో చూస్తే భీమిలీ ప్రాంతం అంతా మరో జూబ్లీ హిల్స్ గా మారిపోతోంది. అనేక ఐటీ పరిశ్రమలు రిసార్టులు హ్పటెల్స్ వస్తున్నాయి. భీమిలీ నియోజకవర్గంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు అయింది. ఇన్ఫోసిస్ సహా కీలకమైన ఐటీ కంపెనీలు వస్తున్నాయి. దాంతో భీమిలీ మీద అందరికీ మోజు అయితే పెరిగిపోతోంది. భీమిలీ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరికి వారుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు అని కూటమిలో వినిపిస్తోంది. జనసేన అయితే వచ్చే ఎన్నికల్లో భీమిలీ నుంచి పోటీకి సిద్ధం అని ప్రచారం జరుగుతోంది. మరో వైపు చూస్తే మాజీ మంత్రి భీమిలీ నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరి భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా అంటున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తన రాజకీయ వారసుడిని భీమిలీ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి దించాలని చూస్తున్నారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో సడెన్ గా ఒక గాసిప్ అయితే గట్టిగా వినిపిస్తోంది. అదేంటి అంటే విశాఖ ఎంపీ శ్రీ భరత్ సతీమణి సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని భీమిలీ నుంచి 2029 ఎన్నికల బరిలో దిగుతుందని ఆ గాసిప్ సారాంశం. ఇది సాధ్యపడుతుందా అంటే ఎందుకు కాదని అనేవారు ఉన్నారు. భరత్ ఎంపీగా ఉన్నారు. ఆయన 2024లో బంపర్ మెజారిటీతో గెలిచారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారు అని అంటున్నారు. దాంతో తన ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే భీమిలీ నుంచి సతీమణిని పోటీ చేయించాలని శ్రీ భరత్ అనుకోవడంలో తప్పు లేదని అనే వారూ ఉన్నారు. భీమిలీ నుంచి ఎవరు టీడీపీ నుంచి పోటీ చేసినా గ్యారంటీగా విక్టరీ ఉంటుందని అంతా చెబుతారు. అదే నిజం కూడా. ఇక ఏకంగా బాలయ్య కుమార్తె పోటీ చేయాలనుకుంటే భీమిలీ సీటు టీడీపీ వశం అని కళ్ళు మూసుకునే చెప్పాల్సి ఉంటుందని అంటున్నారు. ఇంతకీ తేజస్వినికి రాజకీయాల మీద ఇంట్రెస్ట్ ఉందా లేదా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏంటి అంటే 1994 ఎన్నికల సందర్భంగా అన్న నందమూరి తారక రామారావు భీమిలీ నుంచి పోటీ చేయాలని అనుకున్నారని ప్రచారంలో ఉంది. చివరి నిముషంలో ఆయన టెక్కలికి వెళ్ళారు. ఇక 2019 ఎన్నికల సమయంలో నారా లోకేష్ భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా వార్తలు వచ్చాయి. మరి ఇపుడు ఈ గాసిప్ వస్తోంది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళ ముందు. మరి ఇది ఒట్టి పుకార్ నా లేక నిజమెంత అంటే కాలమే దీనిని జవాబు చెప్పాల్సి ఉంది అని అంటున్నారు

## ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది. ఒక సీనియర్ మహిళా అధికారిణిగా ఆమె సుదీర్ఘ కెరీర్ ముగింపు దశలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, సర్వీసులో ఉంటూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన వై. శ్రీలక్ష్మి.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఏపీకి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఏపీ కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆమెకు విపరీతమైన ప్రాధాన్యత దక్కింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె సచివాలయంలో చక్రం తిప్పారు. జగన్ హయాంలోనే ఆమెకు వరుస ప్రమోషన్లు లభించి బ్యూరోక్రసీలో టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు.ఐఏఎస్ వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ కెరీర్ ఎంత వైభవంగా సాగిందో.. దానికి రెట్టింపు స్థాయిలో పెను వివాదాలు, లీగల్ ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్దన్ రెడ్డికి అనుకూలంగా జీవోలు ఇచ్చారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, చంచల్‌గూడ జైల్లో సుదీర్ఘ కాలం రిమాండ్ ఖైదీగా జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సైతం ఆమె పేరు ప్రముఖంగా వినపడింది.ఆమెపై ఇప్పటికీ పలు కోర్టు కేసులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు నడుస్తున్నప్పటికీ.. వాటన్నింటినీ పక్కనబెట్టి, రిటైర్మెంట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఆమె సీనియారిటీని గౌరవించింది. సచివాలయంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అధికారుల బదిలీలను చూసే జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ద్వారా ఆమె ఐఏఎస్ కెరీర్‌కు ఒక సాఫీ ముగింపును ఇచ్చే ప్రయత్నం చంద్రబాబు సర్కార్ చేసింది.

## ఇక్కడ ఫ్లై ఓవర్లు...
# అక్కడ ఎయిర్ పోర్టులు

**హైదరాబాద్(భారత శక్తి)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 12 ఏళ్లు గడిచింది. ఒకే రాష్ట్ర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయాయి. విభజన తర్వాత తెలంగాణలో కరెంటు ఉండదని, నక్సలిజం పెరుగుతుందని అప్పట్లో కొందరు నేతలు వ్యాఖ్యానించారు. మరో బిహార్ అవుతుందని హెచ్చరించారు. అయితే ఇందుకు విరుద్ధంగా రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి వేగం పుంజుకుంది. వేర్వేరు ప్రాధాన్యతలతో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఒక్కొక్క రాష్ట్రం తన ప్రధాన సమస్యలను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలను నిర్మించుకుంది. ఇది రెండు రాష్ట్రాల మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని సృష్టించింది.

**హైదరాబాద్‌లో ఫ్లై ఓవర్లు?** తెలంగాణ రాష్ట్రం ఏర్పడినత ర్వాత అధికారం చేపట్టిన కేసీఆర్ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంపై ఎక్కువ దృష్టి పెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత దాదాపు ఒక దశాబ్దంలో హైదరాబాద్‌లోనే 35కిపైగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, సబ్‌వేలు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచింది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, రోడ్ల విస్తరణ, చెరువుల సుందరీకరణ వంటి పనులు కూడా చేపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఈ క్రమాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఫ్లై ఓవర్లను ప్రారంభించింది.

**ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలు..** ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర విభజన తర్వాత విమానాశ్రయాల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించింది. కర్నూల్, కడప, భోగాపురం వద్ద కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాలు ఏర్పాటు చేయడం, అమరావతిలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం, గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలకు సన్నాహాలు చేయడం ద్వారా రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచాలని ప్రయత్నిస్తోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులకు త్వరలో అందుబాటులోకి రానుంది.

**ఏపీలో నగరాభివృద్ధి లోపం..** ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణం చాలా తక్కువగా ఉంది. మెట్రో ప్రాజెక్టులతో ఫ్లై ఓవర్లను ముడిపెట్టే ప్రతిపాదనలు కేంద్రం నుంచి ఆమోదం పొందలేకపోవడం ఒక కారణం. రాజధాని అమరావతి నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల మిగిలిన జిల్లాలు, నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ పనులు వెనకబడ్డాయి. అలాగే నగరాల్లో పచ్చదనం పెంచడంలో కూడా తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంది.

## రెండు రాష్ట్రాల ప్రాధాన్యతలు

**(భారత శక్తి)** తెలంగాణ ప్రభుత్వం పట్టణీకరణ వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్లు, రోడ్ల అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకుంది. అయితే కొత్త విమానాశ్రయాల ఏర్పాటులో వెనుకబడింది. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఆమోదం వచ్చినా నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. ఆంధ్రప్రదేశ్ మాత్రం రాష్ట్ర విభజన తర్వాత కనెక్టివిటీ, ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయాలు, హైవేల నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టింది. కానీ నగరాల్లో ట్రాఫిక్ సౌకర్యాలు, ఫ్లై ఓవర్ల నిర్మాణంలో ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది.ప్రస్తుతం తెలంగాణకు కొత్త విమానాశ్రయాలు అవసరం ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ, పచ్చదనం పెంచడం అత్యవసరం. రెండు రాష్ట్రాలు తమ బలహీనతలను గుర్తించి, ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ సమతుల్య అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉంది.

భారత శక్తి VOICE OF INDIAN

శనివారం, జూన్ 27, 2026

## నిర్మల్ జైలు నుండి చర్లపల్లి జైలుకు..

### గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఖైదీ మృతి

**(భారత శక్తి)**అత్యాచారం కేసులో న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించడంతో.. కొన్నేళ్లుగా నిర్మల్ జైలు లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ సోన్న అడెల్లు అనారోగ్యం పాలయ్యాడు. దీంతో అతన్ని చర్లపల్లి జైలుకు తరలించి అవసరాన్ని బట్టి గాంధీ హాస్పిటల్ లోచికిత్స అందిస్తున్నారు. చాతీ, ఒళ్లు నొప్పులతో అనారోగ్యానికి గురైన అతడికి పలుమార్లు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈనెల 24న గుండెపోటు రావడంతో హాస్పిటల్ లో చేర్పించారు. ఈ క్రమంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో డయాలసిస్ కూడా చేశారు. చికిత్స పొందుతూ గురువారం ఖైదీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కార్డియోజెనిక్ షాక్ తో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతుడి కుటుంబసభ్యులకు జైలు అధికారులు సమాచారం అందించారు.

## నేటి నుంచే రొట్టెల పండుగ...

**నెల్లూరు (భారత శక్తి):** నెల్లూరు బారాషహీద్ దర్గాలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే 'రొట్టెల పండుగ' నేటి నుంచి 5 రోజుల పాటు వైభవంగా జరగనుంది. స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకోవడానికి పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. 26న గంధ మహోత్సవం, 27న గంధం, 28న రొట్టెల పండుగ, 29న తహలీల్ ఫాతేహా జరగనుండగా, 30న ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నారు.


## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు..

### - నీట్ అవకతవకలపై కాంగ్రెస్ ధ్వజం.



**తిరుపతి(భారత శక్తి)** తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో నేడు తిరుపతి ప్రెస్ క్లబ్ నందు నీట్ పరీక్షల అవకతవకలపై మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ తరపున నీట్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షల విషయంలో వరుసగా వెలుగులోకి వస్తున్న అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేస్తూ భావి భారత భవిష్యత్ పౌరులు అయినటువంటి విద్యార్థుల భవిష్యత్తును నేటి ప్రభుత్వాలు అంధకారం చేస్తున్నాయని పరీక్షల నిర్వహణలో చోటు చేసుకున్నటువంటి లోపం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ మరింత కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు పంట శ్రీనివాసులు రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, తిరుపతి నగర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త ఐరాల లోకేష్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బల్ల హరి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెంకటాచలపతి, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జ్యోతీశ్వర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిరంజీవి, పూల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రజాప్రతినిధులకు శ్రీకాళహస్తి ఆలయ ప్రసాదం అందజేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.



**రేణిగుంట(భారత శక్తి)** కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రంలో ఆ ఏడుకొండల స్వామి వారిని దర్శించుకున్న మహారాష్ట్రకు చెందిన ప్రముఖ ప్రజాప్రతినిధులను, తన మిత్రులను కలవడం ఈరోజు ఎంతో సంతోషాన్నిచ్చిందని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు.?శ్రీవారి దర్శనానంతరం తిరుమలలో తన మిత్రులైన కల్యాణ్ లోక్‌సభ ఎంపీ డాక్టర్ శ్రీకాంత్ షిండే, టీటీడీ బోర్డు మెంబర్ శ్రీ సౌరభ్ బోరా, ధారాశివ్ ఎంపీ ఓంప్రకాష్ పవన్ రాజేనింబాల్కర్ మరియు సీఎం రాజేష్‌లను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా వారికి మన శ్రీకాళహస్తి ఆలయ పవిత్ర ప్రసాదాన్ని అందజేసి, సాదరంగా వీడ్కోలు పలికారు. ఆ ముక్కంటి కృపాకటాక్షాలు, ఏడుకొండల స్వామివారి ఆశీస్సు లు వారికి ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## ఏపీ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో తెలంగాణ బిడ్డలు..

**విజయవాడ(భారత శక్తి)** రాష్ట్రాలు వేరైనా, రాజకీయాలు ఎల్లలు గీసినా.. నిజమైన ప్రతిభకు ప్రాంతీయ సరిహద్దులు అడ్డుకావనే సరికొత్త చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత కొన్ని వారాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ సెంటిమెంట్ , నిజమైన తెలంగాణ బిడ్డ ఎవరు? అనే రాజకీయ లెక్చర్లు, వాదోపవాదాలు జరుగుతున్న తరుణంలో.. దీనికి పూర్తిగా భిన్నమైన, ఆరోగ్యకరమైన ఒక ని ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టును ముందుండి నడిపిస్తున్న కీలక వ్యక్తుల నేపథ్యమే ఇందుకు ప్రధాన కారణం.ఈ సరికొత్త చర్చకు ఒక సీనియర్ జర్నలిస్ట్ పెట్టిన ట్వీట్ వేదికైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారిణి ధాత్రి రెడ్డి పక్కా తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆమెతో పాటు ఈ ప్రాజెక్టులో కీలక భూమిక పోషిస్తున్న దీప్తి , ఒకప్పుడు అమెరికాలో ఉంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. కోసం తీవ్రంగా శ్రమించిన యాక్టివిస్ట్. ఒకప్పుడు మనం.. ఆంధ్రానా అని అదోలా నవ్వుకున్న ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు, నేడు నవ్యాంధ్ర ప్రగతి చక్రంలో అత్యంత కీలకమైన ఆవిష్కరణల విభాగాన్ని నడిపిస్తున్నారు. రాజకీయం గీసిన అదృశ్య బోర్డర్లను దాటి ప్రతిభ తన దారిని తాను ఎలా వెతుక్కుంటుందో చెప్పడానికి ఇది నిదర్శనంగా నిలిచింది. సదరు జర్నలిస్ట్ తన ట్వీట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని వారాలుగా తెలంగాణ సెంటిమెంట్ చుట్టూ తిరుగుతున్న ఉపన్యాసాల మధ్య, ఏపీ ప్రభుత్వ ప్రాజెక్టులో ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు లీడ్ రోల్ పోషిస్తున్నారనే వార్త నాలో ఆనందం నింపింది. ఏపీ ప్రభుత్వం తమ రాష్ట్ర అవసరాలకు ఎలాంటి టాలెంట్ కావాలో చూసింది తప్ప, ఆ టాలెంట్ ఏ ప్రాంతం నుండి వచ్చిందో చూడలేదు. మీ మాతృభూమిపై మీకు గర్వం ఉండొచ్చు, కానీ ఏ రాజకీయ నేత కూడా మీ ప్రతిభను రాష్ట్ర సరిహద్దుల వద్ద ఆపలేరని గుర్తుంచుకోండి" అని సదరు జర్నలిస్ట్ రాసుకొచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం సెంటిమెంట్‌ను వాడుకునే నేతల అసలు రంగును గుర్తించాలని పిలుపునిచ్చారుఈ వైరల్ ట్వీట్‌పై ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ , మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ అద్భుతమైన రిప్లై ఇచ్చారు. "దీనితో నేను వంద శాతం ఏకీభవిస్తున్నాను. మేము నిర్మిస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ సరిగ్గా ఇలాగే ఉంటుంది. భౌగోళిక సరిహద్దుల కంటే ప్రతిభకు మాత్రమే విలువనిచ్చే రాష్ట్రాన్ని మేము తయారుచేస్తున్నాం. మా వద్దకు వచ్చే వారిని మీరు ఎక్కడి నుండి వచ్చారు అని మేము అడగం.. మీరు ఈ రాష్ట్రం కోసం ఏం నిర్మించగలరు? అని మాత్రమే అడుగుతాం.

# కొనసాగుతున్న బంద్

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణ ప్రజలకు ముఖ్యమైన గమనిక.. మూడు రోజుల పాటూ రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలగనుంది. ఈ నెల, 27, 28 తేదీల్లో సేవలు నిలిపివేయనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్, అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో తెలియజేశారు. 28న ఆదివారం కావడంతో ప్రభుత్వ సెలవులు వచ్చాయి. ఈ నెల 27న పనిదినం.. ఆ ఒక్కరోజు రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి యథావిధిగా సేవలు పునఃప్రారంభమవుతాయని గాంధీ తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఈ షెడ్యూల్ రూపొందించామన్నారు.సర్వర్ నిర్వహణ ప్రక్రియతో పాటుగా ఆన్‌లైన్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేసేలా మూడు రోజుల పాటూ పనులు చేపడతామన్నారు. భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, సేవల్లో నాణ్యత మెరుగుపర్చడం కోసం నిర్వహణ పనులు చేయబోతున్నట్లు తెలిపారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నారు. ప్రజలు ఈ షెడ్యూల్ ప్రకారం రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన పనుల్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు అధికారులు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారుతెలంగాణలో ప్రతిరోజూ భారీగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి.. ఒకవేళ రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడితే ప్రభుత్వానికి కూడా కొంత నష్టం తప్పదు. అందుకే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఈ సర్వర్ నిర్వహణ పనుల్ని సెలవు దినాల్లో కలిసొచ్చేలా ప్లాన్ చేసింది. అప్పుడు ప్రజలకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. మూడు రోజుల పాటూ ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతుండగా.. ఈ నెల 26న మొహర్రం సెలవు దినం, ఈ నెల 27న మాత్రం పనిదినం, ఈ నెల 28న మళ్లీ ఆదివారం వచ్చింది. దీంతో కేవలం ఒక్కరోజు మాత్రమే ప్రజలకు ఇబ్బంది ఎదురవుతుంది. ఒక్కోరోజు మాత్రమే సేవలు అందుబాటులో ఉండవని అధికారులు చెబుతున్నారు.

# పేదల ఇళ్ల కోసం ముట్టడి

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణలోని నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు సాధించడమే లక్ష్యంగా వామపక్ష పార్టీలు విద్యుత్ ఉద్యమం తరహాలో సరికొత్త పోరాటానికి రెడీ అయ్యాయి. హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్‌పూర్‌లలో పేదల గుడిసెలను అర్ధరాత్రి వేళ అక్రమంగా కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 27న హనుమకొండలో 10 వేల మందితో భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అలాగే జూలై 1న కలెక్టరేట్ల ముట్టడి, జూలై 6న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టి, సేకరించిన దరఖాస్తులను నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.తెలంగాణలోని నిరుపేదలకు ఇళ్లు, నివాస స్థలాల హక్కులను సాధించడమే పరమావధిగా వామపక్ష పార్టీలు మరో చారిత్రాత్మక పోరాటానికి సిద్ధమయ్యాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఊపేసిన విద్యుత్ ఉద్యమం తరహాలోనే.. ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు వామపక్ష నేతలు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్‌తో కలిసి ఈ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు.హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్‌పూర్‌లలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు, పోలీసులు అమానవీయంగా తొలగించడాన్ని వామపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఇళ్లు లేక ఆశ్రయం పొందుతున్న పేదలకు తక్షణమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఈ నెల 27వ తేదీన హనుమకొండ నగరంలో దాదాపు 10 వేల మంది నిరుపేదలతో కలిసి భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శన ద్వారా ప్రభుత్వానికి పేదల ఆగ్రహాన్ని రుచి చూపిస్తామని హెచ్చరించారు.జూలై 1వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నిరుపేదలందరి నుండి ఇళ్ల స్థలాల దరఖాస్తులను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. ఆ విధంగా సేకరించిన వేలాది దరఖాస్తులతో జూలై 6వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి ఈ దరఖాస్తులను నేరుగా అందజేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి స్పందన, ఇచ్చే హామీల ఆధారంగానే తమ తదుపరి ఉద్యమ కార్యాచరణ ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.గుండ్ల సింగారంలో గత నాలుగేళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే.. అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని నేతలు మండిపడ్డారు. మహిళలు, చిన్న పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగి పడేశారని అడ్డు వచ్చిన యువకులు, వృద్ధుల కాళ్లు చేతులు మడిచి మరీ బలవంతంగా పోలీస్ వాహనాల్లోకి ఎక్కించి సుమారు 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని అదే సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉంటే వాటిని ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. బాధిత పేదలకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని గుర్తుచేశారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని కాబట్టి వారందరికీ వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చి రక్షణ కల్పించాలని వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## పంచాయతీ రాజ్‌శాఖలో మరోసారి ప్రమోషన్లు

**విజయవాడ,(భారత శక్తి)** ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖ అధికారులకు మరో తీపికబురు అందించారు. తాజాగా 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపీడీవోలు), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా (డీడీవోలు) పదోన్నతులు కల్పించే ప్రక్రియకు పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదించింది. దీంతో త్వరలోనే వీరందరూ ఉన్నత హోదాలో బాధ్యతలు చేపట్టనున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందికి ప్రమోషన్లు కల్పించారు. గత పదేళ్లలో ఇంత భారీ సంఖ్యలో ఈ శాఖలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారువర్షాకాలంలో నిలిచి ఉన్న నీటితో దోమలు పెరిగి, పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామ పంచాయతీ ప్రజారోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. అన్ని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు అందుబాటులో ఉంచి, అవసరమైన చోట తక్షణం వినియోగించాలి" అని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

## ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు కూడా అయిపోయాయని.. ఇంకా పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో కాలేజీలను నడపడం కష్టంగా మారిందని.. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం కూడా కాలేజీలకు భారంగా మారిందని హైకోర్టు పేర్కొంది.ఈ క్రమంలోనే ప్రైవేటు కాలేజీలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ఎప్పటి లోగా చెల్లిస్తారో చెప్పారని హైకోర్టు ఆదేశించింది.

# ఐఏఎస్ బదిలీలు

**హైదరాబాద్(భారత శక్తి),** రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమించింది. ఈ క్రమంలోనే మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులకు.. బదిలీలు, పోస్టింగ్‌లు కల్పించింది. అదే సమయంలో సీఎంఓ నుంచి అజిత్ రెడ్డిని తొలగించింది. ఈ నేపథ్యంలోనే సీనియర్ ఐఏఎస్ శ్రీధర్‌కు సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించారుఈ క్రమంలోనే సబ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పగించింది. అదే సమయంలో శైలజా రామయ్యర్‌ను ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్ శ్రీధర్.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జాకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు ఇచ్చింది.మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలను ఎం.రఘునందన్ రావుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా అజిత్ రెడ్డిని ట్రాన్స్‌ఫర్ చేసింది. హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పి. కాత్యాయని దేవికి పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీగా కె. గంగాధర్‌ను బదిలీ చేసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి. వెంకన్నకు పోస్టింగ్ ఇచ్చింది. టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)లో కీలకమైన మార్పులకు రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టారు. పాలనా యంత్రాంగాన్ని మరింత పరుగులు పెట్టించడంలో భాగంగా సీఎంవోలో భారీ ప్రక్షాళన చేపట్టింది. గత కొంతకాలంగా సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న అజిత్ రెడ్డిని తీసేసి.. శ్రీధర్‌కు చోటు కల్పించారు. శ్రీధర్ రాకతో సీఎంవోలో పాలనాపరమైన నిర్ణయాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలంగాణ సచివాలయ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి.

## ముదిరిన అయోధ్య రామ మందిర

# కానుకల చోరీ కేసు

**అయోధ్య,(భారత శక్తి)** సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు.రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ ఓఓ లేదా డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి.రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు.

**కేసు పూర్వాపరాలు ఏంటీ** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు.ఎఫ్ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవినాష్ శుక్లా కూడా పాలుపంచుకున్నాడు. కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా కూడా నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు.ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొన్న వ్యక్తులు చాలావరకు కానుకల లెక్కింపు, నగదు నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉద్యోగులేనని అర్థమవుతోంది. ఇది, వీరు వ్యవస్థలోని కింది స్థాయి వ్యక్తులు మాత్రమేనా, లేక ఈ వ్యవస్థ మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాలు, రక్షణలో పనిచేస్తోందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది.అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, సిట్ ప్రాథమిక నివేదిక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను అనుమానితుడిగా గుర్తించింది. ఈ నివేదిక సిబ్బంది నియామక ప్రక్రియపై కూడా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. చాలా మంది ఉద్యోగులు ఎలాంటి లిఖితపూర్వక నియామక ఉత్తర్వులు లేకుండా పనిచేస్తున్నారని, వారి నేపథ్యాలను సరిగ్గా ధృవీకరించలేదని అందులో పేర్కొన్నారు. డొనేషన్స్ లెక్కింపు, పర్యవేక్షణ, నమోదు, భద్రతా ఏర్పాట్లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని కూడా విచారణలో తేలింది. ఇది మొత్తం వ్యవస్థ పారదర్శకతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. విచారణలో భాగంగా చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను కూడా ప్రశ్నించారు. విచారణ సమయంలో చంపత్ రాయ్‌ను అనేక ముఖ్యమైన ప్రశ్నలు సిట్ అడిగింది. విరాళాలను లెక్కించే బాధ్యత గల ఉద్యోగులు ఎవరు? ఈ ఉద్యోగులను ఎవరు నియమించారు? విరాళాల పెట్టె నుంచి డబ్బును తీయడం, దానిని లెక్కించడం, బ్యాంకులో జమ చేసే ప్రక్రియ ఎలా జరుగుతుంది? సిసిటివి, రికార్డింగ్, భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉద్యోగులు బయటకు వెళ్లేటప్పుడు వారిని తనిఖీ చేశారా? లేదా అని గ్రిల్ చేశారు. అంతే కాకుండా నగదు లెక్కింపు సమయంలో ఆయన హాజరు, ఉద్యోగుల ధృవీకరణ, సీసీటీవీ కెమెరాల పనితీరు, వాటిని ఎప్పుడైనా ఆపివేశారా, నగదు లెక్కల్లో మరెవరు పాలుపంచుకున్నారు వంటి ఎనిమిది కీలక ప్రశ్నలను కూడా సిట్ ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రాను అడిగింది.ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా, నిబంధనలు పాటించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తి ఉండేది కాదని గతంలోనే అంగీకరించారు. ఏబీపీ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, పర్యవేక్షణ దాదాపుగా లేదని, పరిపాలనా నిర్వహణ అనుభవం తీవ్రంగా కొరవడిందని పేర్కొన్నారు. వ్యవస్థను నిర్వహించడానికి స్వతంత్ర అధికారం కలిగిన ఒక అనుభవజ్ఞుడైన పరిపాలనా అధికారిని ట్రస్ట్ కింద నియమించాలని ఆయన సూచించారు.

# అయోధ్య విరాళాల్లో అవినీతి



**హైదరాబాద్,(భారత శక్తి)** అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల సేకరణలో ఏకంగా రూ. 200 కోట్ల భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పినప్పటికీ... యూపీ సిట్ పోలీసులు ఆయన సొంత మనుషులనే అరెస్ట్ చేశారని తెలిపారు. కేవలం చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను పదవుల నుంచి తప్పించి బీజేపీ చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ స్కామ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని, దేవుడి కోసం సేకరించిన విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని చామల మండిపడ్డారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి చెందిన 20 మంది ఎంపీలను, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రేకు చెందిన ఆరుగురు ఎంపీలను ఒక్కొక్కరికీ రూ. 75 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయడానికి ఈ రాముడి సొమ్మునే వాడారంటూ తీవ్రస్థాయిలో ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని... ఇప్పుడు చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను కేవలం పదవుల నుంచి తప్పిస్తే సరిపోదని అన్నారు.

## రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు

**విశాఖపట్నం (భారత శక్తి)**భారత రాష్ట్రపతి ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖలు అత్యంత అప్రమత్తతతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం, యూనివర్సిటీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, రాష్ట్రపతి కార్యాలయం నిర్దేశించిన ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమ వేదిక, భద్రతా ఏర్పాట్లు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

### వికారాబాద్‌లో మాదకద్రవ్యాలకు
## వ్యతిరేకంగా 2కే రన్ నిర్వహణ

**వికారాబాద్ జిల్లా(భారత శక్తి)** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన 2కే రన్ కార్యక్రమాన్ని శాసన సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్ జెండా ఊపి ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు మున్సిపల్ చైర్మన్ మరియు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని 2కే రన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తి ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో జీవిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ యువతకు సరైన మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.

## ఫారెస్ట్ అధికారులను అడ్డుకున్న పోడు రైతులు

**ఆసిఫాబాద్(భారత శక్తి)** ఆసిఫాబాద్ జిల్లాలో ఫారెస్ట్ అధికారులను పోడు రైతులు అడ్డుకున్నారు. మమ్మల్ని అరెస్ట్ చేసినా, చంపినా భూములను వదులుకోము అంటూ తెగేసి చెప్పారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పులస గ్రామ శివారులో అటవీ భూమిని జేసీబీతో చదును చేసేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులను రైతులు అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మా తాతముత్తాతల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని హక్కు పత్రాలు సైతం ఉన్నాయని అన్నారు. కానీ ఇప్పుడు వచ్చి మా భూములు లాక్కుంటే మేము మా పిల్లలు ఎట్లా బతకాలని ఫారెస్ట్ అధికారులను నిలదీసారు. ఉన్న ఈ భూములను లాక్కుంటే ఉపాధి కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేసారు.

## అనంతపురంలో ఉద్రిక్తత

**అనంతపురం(భారత శక్తి)** శుక్రవారం నాడు అనంతపురం లో ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి రోడ్డుపై బైఠాయించారు. తాడిపత్రి బయల్దేరిన అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి లను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల వైఖరికి నిరసనగా కోర్టు రోడ్డులో మాజీ ఎమ్మెల్యేలు అనంత, విశ్వేశ్వరరెడ్డి బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. పోలీసులు బారికేడ్లను అడ్డుగా పెట్టి వైసీపీ నేతలు కార్యకర్తలను అడ్డుకున్నారు.

## కూరగాయల మార్కెట్‌లో అగ్నిప్రమాదం

**కోనసీమ(భారత శక్తి)** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదం జరిగింది. రామచంద్రపురం మండలం ద్రాక్షారామ కూరగాయల మార్కెట్లో అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో 30 వరకు షాపులు దగ్ధం అయింది. దుకాణాల్లోని కూరగాయలు, సరుకులు అగ్నికి ఆహుతి అయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని స్థానికులు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు.

## తాడిపత్రిలో ఉద్రిక్తత

**తాడిపత్రి(భారత శక్తి)** తాడిపత్రి లో శుక్రవారం నాడు ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిబయట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్యం కాపాడాలి అంటూ నిరసన తెలిపారు. పోలీసులు కనుసన్నల్లో మట్కా, గంజాయి సాగు చేస్తున్నారంటూ పెద్దారెడ్డి నినాదాలు చేసారు. పోలీసులు జేసీ ప్రభాకర్ రెడ్డికు తొత్తులుగా పోలీసులు మారారు అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డి ఇంటికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున చేరుకున్నారు. పెద్దారెడ్డి ఇంటికి వెళ్లకుండా నాలుగు వైపుల పోలీసులు భారీ ఎత్తున మోహరించారు.

### పీఎఫ్ డబ్బులు రాక కార్మికురాలి
## ఆత్మహత్యాయత్నం

**వికారాబాద్(భారత శక్తి)** వికారాబాద్ జిల్లా తాండూర్లో విషాద ఘటన చోటు చేసుకుంది. పిఁశ్రీఫ్ డబ్బులు అందక మనస్తాపంతో హన్మమ్మ అనే కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తుంది. ఘటనలో ఆమె తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అదే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్కు రిఫర్ చేసారు.

## 'గోల్డ్ మ్యాన్' సూర్య అరెస్ట్

**హైదరాబాద్ (భారత శక్తి)** సీఎం, పోలీస్ కమిషనర్లకు తాను అత్యంత సన్నిహితుడినని నమ్మించి, విదేశాల నుండి తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ ప్రజలను మోసం చేసిన 'గోల్డ్ మ్యాన్' సూర్యను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

### పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో
## తీవ్ర ఉద్రిక్తత..

**- రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద బంధువుల ఆందోళన**

**మాచర్ల (భారత శక్తి)**కాన్పు కోసం వచ్చి ఆసుపత్రిలోనే నవవధువు మృతి చెందింది. దాంతో ఆగ్రహించిన బంధువులు ఆసుపత్రి అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేసారు. మాచర్ల మండలం సుబ్బారెడ్డి పాలెం గ్రామానికి చెందిన పుణ్యమూర్తి సిలువకుమారి (25) డెలివరీ అయిన కాసేపటికే మృతి చెందింది. ఆడబిడ్డకు జన్మనిచ్చిన సిలువకుమారి, పాప క్షేమంగా ఉన్నా తల్లి కన్నుమూయడంతో కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. మొదటి కాన్పులోనే విషాదం ఆవరించింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ప్రాణం పోయిందని బంధువుల ఆందోళన .న్యాయం చేయాలంటూ ఆసుపత్రి ముందు బందువులు నిరసన కు దిగారు.

# రైతులకు రూ 2లక్షల రుణమాఫీ చేయాలి

### - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.



**రుద్రవరం(భారత శక్తి)** రైతులు కౌలు రైతుల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీ జరిగే మహాధర్నాలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని చలోవిజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రైతు సంఘం నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే భాస్కర్ రుద్రవరం మండలం కార్యదర్శి బాల నరసింహుడు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది ఎన్నికల ముందు కూటమినేతలు గుప్పించిన వాగ్దానాలు గాలి మేడలు అయ్యాయి. క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను తీర్చడానికి ఎలాంటి చర్యలు ఈ ప్రభుత్వాలు చేపట్టడం లేదు. మాది రైతు ప్రభుత్వం రైతు సంక్షేమం అందిస్తున్నామంటూ ప్రచార మాధ్యమాల్లో కోట్లాది రూపాయలతో దొంగ ప్రచారాలు చేసుకోవడం తప్ప రైతులను ఆదుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వాలు ఉండడం లేదు. పంటలకు కనీసం మద్దతు ధర దక్కడం లేదు .సిండికేట్ మార్కెట్ మాయాజాలంలో చిక్కుకొని రైతులు చాలా నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు .కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. కాబట్టి రైతు సంఘం గా మేము చేస్తున్న డిమాండ్ ఏమంటే రైతులకు తక్షణమే రూ2లక్షల రుణమాఫీ ప్రకటించాలి పండిన పంటలకు మద్దతు ధరలు కల్పించాలి. సాగు ఖర్చులు తగ్గేందుకు పెట్రోల్ డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గించాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా పంట రుణాలు ఇవ్వాలి .కౌలు రైతులకు ఎలాంటి హామీ లేకుండా ఆర్బీఐ నిబంధన ప్రకారం ర2 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలి . పంటల బీమా ఇన్పుట్ సబ్సిడీ ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి. మొక్కజొన్న రైతులకు రైతుల దగ్గర పంట ఉన్నప్పుడే సకాలంలో పంట కొనుగోలు ఏర్పాటు చేసి మద్దతు ప్రకారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి .ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు 7 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా తక్షణమే చెల్లించాలి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలి .తెలుగు గంగా కెనాల్ కింద పంట కాలువల నిర్మాణం చేపట్టాలి ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరలు ప్రకారం రైతుల పంటను కొనుగోలు చేయాలి. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలపై సమరభేరి మోగించేందుకు జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ వద్దకు వేలాదిగా రైతులు కౌలు రైతులు తరలివచ్చి జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నాలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్న రైతులు ఇప్పటికైనా మేల్కొని ప్రశ్నించకపోతే రైతు కనీసం ఒక్క ఎకరం పండించడానికి కూడా ఎరువులు తెచ్చుకోలేని పరిస్థితి ఇప్పటి పాలక ప్రభుత్వాలు కల్పిస్తా ఉన్నాయి. కాబట్టి రైతు లోకమా మేలుకో మీ హక్కులకై పోరాడు పాలకుల కళ్ళు తెరిపించడానికి మన హక్కులను సాధించుకోవడానికి తరలిరండి జూన్ 30న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

ఈ కార్యక్రమంలో రుద్రవరం మండల రైతు సంఘం అధ్యక్షులుమిట్టపల్లె నరసింహులు పెద్ద కమ్మలూరు శాఖ కార్యదర్శి ఏ నాగ నరసింహుడు రుద్రవరం రైతు సంఘం కార్యదర్శి కరీముల్లా రైతులు పుల్లయ్య వెంకటేశ్వర్లు సత్యనారాయణ రామాంజనేయులు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం...



**తాడిపత్రి (భారత శక్తి)** తాడిపత్రి పట్టణంలోని ఎల్లనూరు రోడ్డు లో ఉన్న వివేకానంద పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు వద్ది చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా, గౌరవాధ్యక్షుడు కే రామాంజనేయులు, కోశాధికారి పి .రామేశ్వర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి, కన్వీనర్ కే గురప్ప, గౌరవ సలహాదారు చెన్నకేశవుల శ్రీరంగయ్య, ఉపాధ్యక్షులు నారా బోయిన శంకర్, శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరి, నాగేశ్వర్ రెడ్డి, కుమారస్వామి, శ్రీ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేడు మండల కేంద్రం తుగ్గలికు
## జిల్లా కలెక్టర్ సిరి రాక

**- తహసిల్దార్ రవి - పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ.**



**తుగ్గలి:(భారత శక్తి)** నేడు మండల కేంద్రమైన తుగ్గలికు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ వస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రోజున ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం పక్కన, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వెనుక భాగం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ శాంబాబులు హాజరై తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని వారు తెలియజేశారు.కావున శనివారం రోజున జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలియజేశారు. కావున ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల వ్యాప్తంగా గల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రవి ప్రజలకు తెలియజేశారు.

## ఏపీ ఎస్ హెచ్ పి సి సభ్యుడిగా డాక్టర్ రెడ్డన్న



**రాయచోటి,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ సభ్యుడిగా తనను ప్రభుత్వం నియమించి నట్లు రాయచోటి పట్టణానికి చెందిన కంటి వైద్య నిపుణులు జి. రెడ్డెన్న తెలిపారు తెలిపారు. ఏపీ ఎస్ ఏ హెచ్ పి సి మూడేళ్ల పాటు కొనసాగను న్నట్లు తెలి పారు. ఏపీ ప్రభుత్వం జనరల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. రెడ్డెన్న 40 సంవత్సరాలుగా కంటి వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం సురభి ప్రైమరీ హెల్త్ సెంటర్లో ఆప్తాల్మిక్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలోని వందలాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకుచెందిన వేలాది మంది కంటి పరీక్షలు, వైద్య సేవలు అందించారు. వ్యక్తిగ తం తో పాటు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా, అసిస్టెంట్ గవర్నర్గా పనిచేసి కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. కాగా రెడ్డన్న ఏపీ ఎస్ఏ హెచ్పిసి రాష్ట్రస్థాయి సభ్యుడుగా ఎన్నిక కావడం పట్ల రాయచోటికి చెందిన పలువురు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యలతోపాటు పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

### మండలంలో ప్రశాంతంగా ముగిసిన
## మొహారం వేడుకలు

**- పీర్ల దేవుళ్ళు త్యాగానికి గుర్తుగా మొహారం**


**- ఇస్లాం క్యాలెండర్ నూతన దినోత్సవం మొహారం**



**కౌతాళం(భారత శక్తి)** కౌతాళం మండలంలో బాధినేహాల్, నడిచాగీ, లింగాలదిన్నె, బాపురం, పొదల కుంట, హల్వి, చిరుత పల్లి గ్రామ గ్రామంలో కొలువైన పీర్లదేవుళ్ళు కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవుళ్ళు శుక్రవారం ప్రశాంతంగా వేడుకలు ముగిశాయి. పీర్లదేవుళ్ళు గ్రామ ప్రజలందరు 10 రోజులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫతేహాలు, షర్బట్, రోటీ లను నైవేద్యం సమర్పించారు. ముస్లిం లు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకునే పండుగ మొహారం ఒకటి పది రోజులు పాటు జరిపే ఈ పండుగ సందర్భంగా ఇస్లాం కు సంబంధించిన ప్రవచనములు మొహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపిస్తాయి మొహారం నెల పదోరోజున పీర్లను ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున హజ్రత్ ఇమాం హుషేన్ ను అసైన్ హుష్షేన్,అక్బర్ అలీ మరియు పీర్ల దేవుళ్ల గుర్తుగ పంజా ( ప్రతిమ) లను ఉరేగించి తమ సంతాపం ప్రకటిస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం తొలి మాసాన్ని మొహారం నెలగా భావిస్తారు. మొహారం పండుగ పదో రోజున ప్రత్యేకత ఉంది 10,11 వ రోజుల్లో ఉపవాస దీక్షలు పాటించడాన్ని ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. మొహారం నెలలో ముస్లింలు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించారు. తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హుషేన్ కు సంతాపం తెలిపే ఉద్దేశ్యం తో ముస్లింలు పాటిస్తారు.మానవ హక్కులకోసం జరిగిన చరితాత్మక పోరాటం మొహారం ఈ పేరు వినగానే పిర్లు, నిప్పుల గుండాలు గుండెలు బాదుకుంటు మతం చదవటాలు గుర్తుకువస్తాయి. బుధవారం గ్రామ ,మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం పీర్లదేవుళ్ళు ఊరేగింపుగ వెళ్లారు.ఊరేగింపు లోప్రజాలు నైవేద్యాలు సమర్పించారు.అనంతరం పీర్ల దేవుళ్ళు భక్తి భావంతో ప్రత్యేక ఫతేహాలు,ఏటికి తీసుకుని వెళ్లారు. ప్రత్యేక ఫతేహాలు అనంతరం షర్బట్ ,రొట్టెలు పంచి పెట్టారు. సీఐ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బారి బంద్బస్తు చేపట్టారు. భారీగా ముస్లిం సోదరులు, హిందు సోదరులు పాల్గొన్నారు.

### నరసరావుపేటలో వీధి దీపాల సమస్యను
## పరిష్కరించండి

**- ఎమ్మెల్యే చదలవాడకు సిపిఐ నాయకులు వినతి పత్రం**



**నరసరావుపేట(భారత శక్తి)** నరసరావుపేటలో వీధి దీపాలు సరిగ్గా వెలగక ప్రజలతోపాటు, పాద చారులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, కార్యదర్శి ఎస్కె చిన్న సైదా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నరసరావుపేట పల్నాడు రోడ్డు, గుంటూరు రోడ్డు, వినుకొండ రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు చిలకలూరిపేట తోపాటు పలు రహదారుల వెంబడి వీధి దీపాలు లేకపోవడంతో మందు బాబులకు ఆ ప్రాంతాలు ఆవాస కేంద్రాలుగా మారాయి అని అన్నారు. అదేవిధంగా రహదారుల వెంబడి విద్యుత్ దీపాల పరిధిని పెంచాలని, దీంతో కొంతవరకైనా ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకునే విధంగా ఉంటుందని, సంబంధిత విద్యుత్ శాఖ, మునిసిపల్ శాఖ అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు కు వినతి పత్రం అందజేశారు.

# చిన్నారిపై వృద్ధుడి అత్యాచారం

**ఏలూరు(భారత శక్తి)** నాలుగో తరగతి చదువుతున్న 9 ఏళ్ల బాలికపై బాలిక స్నేహితురాలి తాతయ్య లక్ష్మణరావు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కొంత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది డిసెంబర్ లో లక్ష్మణరావు ఇంటికి పడుకోడానికి వెళ్లిన బాలికపై అతను అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ముభావంగా ఉండడం అనారోగ్య సమస్యలకు గురి కావడంతో తల్లి బాలికను ప్రశ్నించగా జరిగిన విషయం తెలియజేసింది. దీంతో బాలిక తల్లిదండ్రులు ఏలూరు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేయగా ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ కేసును విచారణ చేపట్టారు. ప్రస్తుతం బాలిక ఏలూరు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది

# వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు

**- సర్ ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలి**

**- టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్**



**హైద్రాబాద్(భారత శక్తి)** ప్రాముఖ్యత అందరూతెలుసుకోవాలని,వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు రాజ్యాంగం మనకి కనిపించిందనిటీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్అన్నారు.శుక్రవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ పాస్పోర్ట్ అనేది కూడా సిటిజెన్ షిప్ కాదు అంటున్నారూ బీజేపీ మెంబెర్ షిప్ ఉంటేనే సిటిజెన్ గా కన్సిడర్ చేస్తున్నారు ఇతర రాష్ట్రాల లో సాఐఖీ పేరుతో బీజేపీ ఎలా అధికారం లోకి వస్తుందో మనం చూసాం ఇప్పటి వరకు 8 సార్లు సాఐఖీ ప్రక్రియ జరిగింది దేశం లో తెలంగాణ మా టార్గెట్ అని బీజేపీ నేతలుమాట్లాడుతున్నారు బీజేపీ వోట్ చోరీ , ఈవీఎం చోరీ , సీటు చోరీతో పాటు, పార్టీ చోరీ , రాముని గుడి చందా చోరీ కూడా చేస్తుందని విమర్శించారు.వోట్ అప్లై చేసుకోవటం అందరి బాధ్యత, అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జగదీష్ కోరారు

## తెలంగాణ రైతులకు శుభవార్త ఒకేసారి

# 'రైతుభరోసా' నిధులు రిలీజ్

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఈసారి రైతుల ఖాతాల్లో ఒకేసారి జమ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిధులను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం అధికారికంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున, రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ. 12 వేల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. ఈ వానాకాలం సీజన్‌లో రైతుభరోసా లబ్ధి పొందడానికి ప్రభుత్వం కీలక విధివిధానాలను ఖరారు చేసింది. ఈ నెల 15వ తేదీ నాటికి 'భూభారతి' పోర్టల్‌లో భూమి వివరాలు నమోదై, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సీసీఎల్ఏ నుంచి అనుమతులు పొందిన రైతులకు మాత్రమే ఈ సాయం అందుతుంది. అలాగే, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన గిరిజన రైతులు కూడా ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ నుంచి అనుమతులు పొంది ఉండాలి. అర్హులైన రైతుల రికార్డులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఒక జిల్లా పరిధిలోనే దాదాపు 3.58 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉండగా, వారి కోసం రూ. 460 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జాబితాలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 3,906 మంది రైతులు కూడా ఉన్నారు.

# వినుకొండ డిపో బస్సు కండక్టర్ వీరంగం

**- మద్యం మత్తులో ఉండి ఒక చేతిలో సిగరెట్ పట్టుకొని ప్రయాణికుల తోటి బూతులతో వీరంగం...**



**పల్నాడు(భారత శక్తి)**వినుకొండ నుంచి దోమల గూడెం వెళుతున్నటువంటి బస్సు లో నీ కండక్టర్ ఆడవారి పట్ల మరియు ప్యాసింజర్ పట్ల దుర్సుగా ప్రవర్తించడం.ఆడవారితో అసభ్య పదజాలం వాడటం వంటి చేస్తున్నారని బస్సులోని ప్రయాణికులు తెలియజేయడం జరిగింది కండక్టర్ డ్యూటీ టైం లో మద్యం సేవించి ఉన్నట్లు ప్యాసింజర్ చెప్తున్నారు. దీనిపై ఆర్టీసీ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు తెలిపారు.

## యువత చెడు అలవాట్లకు

# దూరంగా ఉండాలి

**- ఎంపి భరత్**

**విశాఖపట్నం(భారత శక్తి)**మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించి యువతకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత విశాఖపట్నం నిర్మాణంతో పాటు ఆనందభరితమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు భారీ అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఎంపీ ఎం. భరత్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఏపీ గ్రోవర్ ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఎం. భరత్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో మాదకద్రవ్యాల వ్యసనం ఒకటిగా మారిందన్నారు. కుటుంబ విలువలు, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం కలిగిన యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండగలరని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఇటీవల సెంట్రల్ జైలును సందర్శించిన సందర్భంగా గణనీయమైన సంఖ్యలో ఖైదీలు డ్రగ్స్ సంబంధిత కేసుల్లో ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోందన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి

# అందరూ భాగస్వాములు కావాలి

**- అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జడ్చర్లలో భారీ వాకథాన్**

**- ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి**




**మహబూబ్ నగర్(భారత శక్తి)** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియం, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్లో జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన వాకథాన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది విద్యార్థులు, వాకర్స్, యువత, మహిళలు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దుష్ప్రవర్తన అని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు మళ్లే యువత తమ జీవితాలను, కుటుంబాల ఆశలను, సమాజ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణం వ్యాపార, విద్యా మరియు రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉండటంతో, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారని, ఈ పరిస్థితుల్లో మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాకు అవకాశాలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రత్యేకంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉండేలా అందరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజికంగా తీవ్రమైన నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తి క్రమంగా కుటుంబానికి దూరమవడమే కాకుండా నేరప్రవర్తన వైపు వెళ్లే ప్రమాదం కూడా ఉంటుందని అన్నారు.మహబూబ్నగర్ జిల్లాను పూర్తిగా డ్రగ్-ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడం పోలీసు శాఖ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరి సహకారం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.తదుపరి మినీ స్టేడియం నుండి నేతాజీ చౌరస్తా వరకు భారీ వాకథాన్ ర్యాలీ నిర్వహించబడింది. ర్యాలీ మొత్తం డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సందడి చేసింది. నేతాజీ చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ గారు అందరితో కలిసి మాదకద్రవ్యాల వినియోగాన్ని దూరం పెట్టాలని, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మినీ స్టేడియంకు తిరిగి చేరుకున్న తర్వాత విద్యార్థులు, ప్రజలు మానవహారంగా నిలబడి మాదకద్రవ్యాల నిర్మూలనకు మద్దతుగా పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వాకింగ్ అసోసియేషన్ సభ్యులు, యోగా సభ్యులు, విద్యార్థులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం

# దుష్ప్రచారాలను నమ్మొద్దు

**- అక్రమాల దారులు మూసుకుపోవడంతోనే అసత్య ప్రచారం, పారదర్శక వ్యవస్థను చూసి కొందరిలో అసహనం**

**- నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి,(భారత శక్తి)** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా, సకాలంలో సబ్సిడీ ఎరువులు అందించేందుకు ప్రవేశపెట్టిన ఒఖంఎటూ 2.0 వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒఖంఎటూ 2.0 ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2,97,733 మంది రైతులకు 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ విజయవంతంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. దీనివల్ల అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా పూర్తి భరోసా కల్పించామని మంత్రి పేర్కొన్నారు.రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ంఔఉఖీంఇ) శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలోనే ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో సమతుల్య ఎరువుల వినియోగం పెరిగి, రైతులకు దిగుబడులు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా సక్రమంగా వినియోగమవుతుందని చెప్పారు. ఒఖంఎటూ 2.0 ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం లభించిందన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై రాష్ట్రవ్యాప్తంగా రియల్‌టైమ్ పర్యవేక్షణ సాధ్యమవుతోందని, తిఈటూ, ఒఖంఎటూ, భౌతిక నిల్వల సమన్వయంతో ఖచ్చితమైన నిల్వల నిర్వహణ జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత తలెత్తకుండా, అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా పంపిణీ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కౌలు రైతులతో సహా అర్హులైన ప్రతి రైతుకు సమాన అవకాశాలు కల్పించేలా ఈ వ్యవస్థ రూపొందించబడిందని చెప్పారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 155251 కు కాల్ చేయవచ్చని మంత్రి తెలిపారు.రైతులు తమ ఎరువుల కొనుగోలు చరిత్ర, అర్హత వివరాలను కూడా సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని, రైతు-కేంద్రీకృత, పారదర్శక, సాంకేతికత ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థగా ఒఖంఎటూ 2.0 వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఏ నిజమైన రైతుకూ ఎరువు నిరాకరించబడకూడదు... ఏ అనధికార వ్యక్తి లేదా రైతు కాని వ్యక్తికి సబ్సిడీ ఎరువు అందకూడదు అన్నదే ఒఖంఎటూ 2.0 మార్గదర్శక సూత్రమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవస్థ ప్రారంభ దశలో కొద్దిపాటి సాంకేతిక సమస్యలు ఎదురైనప్పటికీ వాటిలో అధిక భాగం ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఙుఖ లేదా సర్వర్‌కు సంబంధించిన తాత్కాలిక సమస్యలు ఎదురవుతున్నా, ప్రత్యేక సాంకేతిక బృందాలు 247 పర్యవేక్షణ చేస్తూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఒఖంఎటూ 2.0 పూర్తిస్థాయిలో సజావుగా పనిచేస్తూ రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎరువుల పంపిణీ కొనసాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ ఎరువుల పంపిణీలో చోటుచేసుకున్న అక్రమాలు, మళ్లింపులు, నిల్వలు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాల వంటి అవకతవకలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడానికే ఒఖంఎటూ 2.0 వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ పారదర్శక విధానం అమలులోకి రావడంతో అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందని, దీంతో కొందరి స్వార్థ ప్రయోజనాలకు గండిపడిందని పేర్కొన్నారు. అందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్ తనకు అనుకూలంగా ఉన్న పత్రిక ద్వారా రైతులను మభ్యపెట్టేలా నిరాధార కథనాలు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో తనకు అనుకూలమైన కొందరు డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి సబ్సిడీ ఎరువులను అక్రమంగా మళ్లించే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఒఖంఎటూ 2.0 వల్ల అలాంటి అక్రమాలకు పూర్తిగా చెక్ పడిందన్నారు. సాక్షి పత్రిక వాస్తవాలను పూర్తిగా విస్మరించి నిరాధార కథనాలను ప్రచురించడం బాధ్యతాయుత జర్నలిజానికి విరుద్ధం. క్షేత్రస్థాయి వాస్తవాలు, అధికారిక గణాంకాలు, సంబంధిత వివరాలను ధృవీకరించిన తర్వాతే వార్తలు ప్రచురించాలి. పత్రిక యజమాని జగన్ రెడ్డి చెప్పగానే అసత్య కథనాలతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు ప్రజలను తప్పుదోవ పట్టించడమే తప్ప ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడవు. నిజాలను తెలుసుకుని, వాస్తవాలను ప్రతిబింబించేలా బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చేసే ప్రయత్నాలను రైతులు విశ్వసించరని, పారదర్శక పాలనతో నిజమైన రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.టమాటా ధరలపై తప్పుడు ప్రచారాలను నమ్మొద్దురాష్ట్రంలో టమాటా ధరలు పూర్తిగా పతనమయ్యాయంటూ, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నమోదవుతున్న అధికారిక ధరలను పరిశీలిస్తే టమాటా ధరలు స్థిరంగానే ఉన్నాయని తెలుస్తోందన్నారు. ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీలో జూన్ 25న 10 కిలోల టమాటా కనిష్ఠ ధర రూ.100, గరిష్ఠ ధర రూ.210, మోడల్ ధర రూ.180 నమోదైందన్నారు. అలాగే గుర్రంకొండ సబ్ మార్కెట్ యార్డులో 10 కిలోల టమాటా కనిష్ఠ ధర రూ.112, గరిష్ఠ ధర రూ.192, మోడల్ ధర రూ.152 నమోదైందని తెలిపారు. ఈ అధికారిక గణాంకాలే మార్కెట్‌లోని వాస్తవ పరిస్థితిని తెలియజేస్తున్నాయన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారం చేయడం వల్ల రైతుల్లో అనవసర ఆందోళన నెలకొనడమే కాకుండా మార్కెట్‌పై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అలాగే చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరులో ఉన్న జైన్ మ్యాంగో పల్ప్ యూనిట్‌కు సంబంధించి వస్తున్న ప్రచారంపై కూడా మంత్రి స్పందించారు. రెండు యూనిట్లలో ఒకటి నిరంతరంగా పనిచేస్తుండగా, మరో యూనిట్‌లో బాయిలింగ్ విభాగంలో ఏర్పడిన సాంకేతిక సమస్యను రెండు రోజుల వ్యవధిలోనే పరిష్కరించి తిరిగి కార్యకలాపాలు ప్రారంభించినట్లు అధికారుల నివేదికలో స్పష్టమైందన్నారు. యూనిట్ అనేక రోజులుగా నిలిచిపోయిందన్న ప్రచారం నిజం కాదని, ప్రస్తుతం మామిడి పండ్ల అన్‌లోడింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, నిరాధార ప్రచారాలను పట్టించుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి.

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి,(భారత శక్తి)** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ పనులను వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు, వసుంధర నగర్ మరియు తిరుపతి అర్బన్ పరిధిలోని ఆటోనగర్‌లలో పర్యటించి, సర్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతి ఇంటిని సందర్శించి, 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుతం ఉన్న వివరాలను సరిపోల్చాలని, ఈ ప్రక్రియ మొత్తాన్ని బూత్ స్థాయి ప్రతినిధుల సమక్షంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేసి, జాబితాలో ఉండి ప్రస్తుతం అందుబాటులో లేని వ్యక్తుల వివరాలను కూడా సేకరించాలన్నారు. ప్రత్యేక కార్యాచరణతో పెండింగ్ ఓటర్ల మ్యాపింగ్‌ను పూర్తి చేసి నమోదు శాతాన్ని పెంచాలని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఇదే సమయంలో పట్టణ పరిధిలో పర్యటించిన కలెక్టర్, స్థానికులతో మాట్లాడి తాగునీటి సరఫరా, పింఛన్ల పంపిణీపై ఆరా తీశారు. డ్రైనేజీలను క్లీన్ చేయాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి, తహసిల్దార్లు జనార్దన్ రాజు, సురేష్ బాబు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కెరీర్ ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను: కృతి సనన్



కృతి సనన్ ఇటీవల 'కాక్‌టెయిల్–2'తో బాలీవుడ్‌లో భారీ హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమ నుంచి బంపర్ ఆఫర్ అందుకుంది. విజయ్ దేవరకొండ, శౌర్యవ్‌తో కలిసి పాన్ ఇండియా స్థాయి చిత్రంలో కీలక పాత్రలో నటించనుందనే వార్త హల్‌చల్ చేస్తోంది. మరోవైపు, ఓ ఇంటర్వ్యూలో కృతి తన 12 ఏళ్ల సినిమా ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది.

"ప్రారంభంలో చాలా కష్టాలు పడ్డాను. మోడలింగ్ రోజుల్లో నా మొదటి ఫొటో షూట్, మొదటి ర్యాంప్ వాక్ రెండూ పూర్తిగా ఫ్లాప్ అయ్యాయి. ఇంటికి వెళ్లి ఏడ్చాను. కానీ ఆపకుండా మళ్లీ ఆడిషన్లు చేశాను. ఆ పట్టుదలే నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది" అని గుర్తు చేసుకుంది. అంతేకాదు, బాలీవుడ్‌లోని నెపోటిజం పైనా కృతి తీవ్రంగా స్పందించింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ లాంటి స్టార్ కిడ్స్‌లో టాలెంట్ ఉందని, కష్టపడి నిరూపించుకున్నారని చెప్పిన కృతి... టాలెంట్ లేని కొందరు కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా 8–9 ఏళ్ల పాటు వరుసగా అవకాశాలు పొందడం అన్యాయమని మండిపడింది. బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు మొదటి 2–3 ఏళ్లలోనే హిట్‌లు కొట్టకపోతే ఇండస్ట్రీ వారిని పక్కకు నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# 'నేను ఎవరితోనూ రిలేషన్‌లో లేను'

## రూమర్లపై శృతి హాసన్ క్లారిటీ!



స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో తరచూ పలు వార్తలు వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఆమె రిలేషన్‌షిప్ గురించి గత కొంతకాలంగా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ ప్రచారాలపై స్వయంగా శృతి హాసన్ స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శృతి హాసన్‌కు ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం మీరు ఎవరితోనైనా రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అని ప్రశ్నించగా, శృతి ఎలాంటి సందేహాలకు తావులేకుండా సమాధానం ఇచ్చారు.

నేను ప్రస్తుతం ఎవరితోనూ, ఎలాంటి రిలేషన్‌షిప్‌లో లేను అని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడినట్లైంది. అలాగే మరో అభిమాని, నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని అడగగా, చిన్నపిల్లల మానసిక వైద్యురాలిగా (చైల్డ్ సైకాలజిస్ట్) మారాలనుకునేదానిని అని శృతి తెలిపారు. ఈ సమాధానం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఒకప్పుడు తమిళం, తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న శృతి హాసన్ గత కొంతకాలంగా సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. తక్కువ ప్రాజెక్టులు చేస్తున్నప్పటికీ, తన అభిమానులతో మాత్రం సోషల్ మీడియా ద్వారా నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో శృతి హాసన్ ప్రత్యేక పాటలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇక హీరోయిన్‌గా ఆమె నటించనున్న 'సలార్ 2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు శృతి హాసన్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇవ్వడంతో సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

# కాజల్ అగర్వాల్ 'ది ఇండియా స్టోరీ' టీజర్ విడుదల.!




బాలీవుడ్ నటులు కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సోషియో నేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ ఒ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తుండగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా ఉన్నారు. ఈ టీజర్ చూస్తుంటే.. దేశంలో తీవ్రమవుతున్న ఆహార కల్తీ, వ్యవసాయంలో రసాయనాలు, పురుగుమందుల మితిమీరిన వాడకం వెనుక ఉన్న కుంభకోణాల చుట్టూ ఈ చిత్ర కథ సాగనుంది. బాంబే హైకోర్టు నేపథ్యంలో గ్రిప్పింగ్ కోర్టు రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో, శ్రేయాస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రి పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్న 'ది ఇండియా స్టోరీ' 2026 జూలై 24న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

# వెండితెరపై మీర్జాపూర్




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫ్రాంచైజీ 'మీర్జాపూర్'. ఓటీటీ ప్రపంచంలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ కథ 'మీర్జాపూర్: ది మూవీ' పేరుతో త్వరలో థియేటర్లలోకి భారీ స్థాయిలో రానున్నది. 2018లో మొదలైన 'మీర్జాపూర్' కథా ప్రయాణాన్ని కొనసాగిస్తూ, ఆసక్తికరమైన కొత్త కథతో సెప్టెంబర్ 4న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠి, దివ్యేందు తమ పాత్రలతో మరోసారి కనిపించగా, ప్రేక్షకులు అమితంగా ఇష్టపడ్డ బబ్లు పండిట్ పాత్రలో జితేంద్రకుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే రవికిషన్ కొత్త పాత్ర కథకు మరింత బలాన్ని చేకూర్చింది. అభిషేక్ బెనర్జీ, రసిక దుగల్, శ్వేత త్రిపాఠి, తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రానికి కథ: పునీత్ కృష్ణ, నిర్మాతలు: రితేష్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్, దర్శకత్వం: గుర్మీత్ సింగ్, నిర్మాణం: ఎంజీఎం స్టూడియోస్, ఎక్సెల్ ఎంటర్టైన్మెంట్స్.




## ఓటీటీలోకి మరాఠీ బ్లాక్‌బస్టర్ 'రాజా శివాజీ'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!

మరాఠీ చిత్ర పరిశ్రమలో భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చారిత్రక చిత్రం 'రాజా శివాజీ' ఓటీటీ ప్రియుల ముందుకు వచ్చేసింది.

థియేటర్లలో రూ.110 కోట్లకు పైగా కలెక్షన్లతో సంచలనం సృష్టించిన ఈ సినిమా, ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ స్ట్రీమింగ్ అవుతోంది. ఈరోజు నుంచి (జూన్ 26) ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో మరాఠీ, హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.

మరాఠీ, బాలీవుడ్ స్టార్ హీరో రితేష్ దేశ్‌ముఖ్ ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రలో నటించడమే కాకుండా, ఈ చిత్రానికి ఆయనే స్వయంగా దర్శకత్వం వహించారు. రితేష్ భార్య జెనీలియా దేశ్‌ముఖ్ సాయిబాయి పాత్రలో కనిపించడంతో పాటు ఈ సినిమాను నిర్మించారు. వీరితో పాటు సంజయ్ దత్ అఫ్జల్ ఖాన్‌గా, అభిషేక్ బచ్చన్ సంభాజీ భోసలేగా, విద్యాబాలన్, ఫర్దీన్ ఖాన్ వంటి స్టార్ నటులు ముఖ్య పాత్రల్లో కనిపించారు. సల్మాన్ ఖాన్ కూడా ఒక ప్రత్యేక అతిథి పాత్రలో మెరిశారు.

గ్రాండ్ విజువల్స్, పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌లతో ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని తెరపై ఆవిష్కరించిన ఈ చిత్రం థియేటర్ల తర్వాత ఇప్పుడు ఓటీటీలోనూ సందడి చేస్తోంది.

# యథార్థ సంఘటనలతో..!



ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ తనయుడు సుస్వర తరంగ్ హీరోగా పరిచయమవుతున్నాడు. సురవి విజన్స్ ప్రొడక్షన్ పతాకంపై వీరేష్ కోకా దర్శకత్వంలో పి.చక్రధర రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దివ్యాని మొండల్ కథానాయికగా నటిస్తున్నది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు డాలీ క్లాప్‌నిచ్చారు.నేటి యువతరం ఆలోచనల్ని ప్రతిబింబించే కథాంశమిదని, ఈ సినిమా ద్వారా తమ అబ్బాయికి మంచి పేరొస్తుందనే నమ్మ కం ఉందని వందేమాతరం శ్రీనివాస్ అన్నారు. 'నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ కథ రాసుకున్నా. అన్ని కమర్షియల్ అంశాలుంటాయి. హైదరాబాద్, వైజాగ్‌లలో చిత్రీకరణ జరుపుతాం' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: యస్.చంద్రశేఖరన్, సంగీతం: బిబిన్ అశోక్, దర్శకత్వం: వీరేష్ కోకా

భారత శక్తి
శనివారం, జూన్ 27, 2026

# టెట్‌పై భయాందోళనలు వీడండి

## - యుటిఎఫ్ టెట్ కోచింగ్ ప్రారంభోత్సవంలో డీఈవో షేక్ షంషుద్దీన్





**బద్వేలు(భారత శక్తి)** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పై భయాందోళనలు వీడాలని కడప జిల్లా డీఈవో షేక్ శంషుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కడపలోని యుటిఎఫ్ భవన్లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎన్సీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా 2028 ఆగస్టు 31 లోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని, దీనిపై కొందరు ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొని ఉందని ఆయన పేర్కొన్నారు. టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయులకు ఆందోళన అవసరమేలేదని, బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడం పెద్ద సమస్యేమి కాదన్నారు. అయితే విద్యాబోధన ఒకవైపు, కుటుంబ బాధ్యతలు మరొక వైపు చూస్తూ టెట్ పరీక్షకు ప్రిపేర్ కావడం కొంత ఇబ్బందికరమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భంలో ఉపాధ్యాయుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందన్నారు. ఇందులో భాగంగా యుటిఎఫ్ ఉపాధ్యాయులకు ఉచిత కోచింగ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన నిరుద్యోగులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ను నిర్వహించి నిరుద్యోగుల మన్ననలను అందుకున్నారన్నారు. యుటిఎఫ్ ఒకవైపు ఉపాధ్యాయుల సమస్యల పట్ల పోరాటాలు చేస్తూనే, మరోవైపు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఉపాధ్యాయ సంఘాల కృషి వల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహకాలు చేస్తున్నదని తెలిపారు .

యుటిఎఫ్ నిర్వహించే కోచింగ్ ఉపాధ్యాయులు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణతను తప్పనిసరి చేయడం సహేతుకం కాదన్నారు. బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయులలో నెలకొని ఉన్న ఆందోళనను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 23 (1) కి సవరణ చేపట్టి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆలోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష పై దృష్టి కేంద్రీకరించి, సన్నద్ధతకు సమయం వెచ్చిస్తే పాఠశాలల్లో విద్య బోధన కుంటుపడుతుందని వారు పేర్కొన్నారు.

యుటిఎఫ్ ఒకవైపు టెట్ పరీక్ష రద్దుకు పోరాటాలు చేస్తూనే మరోవైపు, ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత పొందేందుకు కృషి చేస్తుందని వారు తెలిపారు. టెట్ ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులెవరూ ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని, ఉపాధ్యాయులు టెట్ పాస్ అయ్యేందుకు అవసరమైన కృషిని యుటిఎఫ్ చేస్తుందని వారు పేర్కొన్నారు. టెట్ పరీక్ష సులభంగా పాస్ అయ్యేందుకు యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నామ మాత్రపు ఖరీదుతో పుస్తకాలు రూపొందించి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టెట్ బోధకులు కోవెల ప్రసాద్ రెడ్డి, బి.మస్తాన్ వలి యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎ.డి.దేవదత్తం, ఎన్.కంబగిరి, సి.సుదర్శన్, జె.వి.సుబ్బారెడ్డి, ఎ.వీరనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, చెరుకూరి శ్రీనివాసులు, బి.ప్రసన్నలక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఇంటిని ముట్టడించిన గురుకుల టీచర్లు

**(భారత శక్తి)**మంత్రి సంధ్యారాణి ఇంటిని గురుకుల ఔట్సోర్సింగ్ టీచర్లు ముట్టడించారు. సాలూరులో మంత్రి నివాసం వద్ద గురుకుల ఔట్సోర్సింగ్ టీచర్ల ధర్నా కు దిగారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఆందోళనను అడ్డుకునే క్రమంలో పోలీసులు టీచర్లను నిలువరించగా,ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.

## మొహరం పండుగ వేడుకల్లో పాల్గొన్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు

**బద్వేలు(భారత శక్తి)** బద్వేల్ నియోజకవర్గం, కాశినాయన మండలం, ఇటుకులపాడు గ్రామంలో నిర్వహించిన మొహరం వేడుకల్లో ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొహరం పండుగ నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు ముస్లిం సోదరులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పీర్ల దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని మతాలు శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడంలో ఇటువంటి పండుగలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజలంతా మత సామరస్యంతో కలిసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, యువకులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి.

### - వరంగల్ డిఎంహెచ్ఓ సాంబశివరావు పిలుపు.

**(భారత శక్తి)**5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివ రావు అన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని వరంగల్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివ రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల 75,621 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు 456 పోలియో బూత్‌లు, 16 ట్రాన్సిట్ పాయింట్లు 21 మొబైల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 89 హై-రిస్క్ ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న 3,740 మంది చిన్నారులకు మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా 46 మంది పర్యవేక్షకులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్వైజర్లు, వాలంటీర్లు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది భాగస్వాములవుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని తాను ఆరుగురు ప్రోగ్రాం అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 29, 30 నాడు ఆరోగ్య సిబ్బంది ఇంటి ఇంటి సందర్శన చేసి వివిధ కారణాలతో పోలియో చుక్కలు వేయించు కోని వారిని గుర్తించి వారికి పోలియో చుక్కలు వేస్తారు అని అన్నారు. 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజున తమ సమీపంలోని పోలియో బూత్‌కు చిన్నారులను తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రయాణాల్లో ఉన్న తల్లిదండ్రులు బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ పోలియో బూత్‌లలో తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలి

### - వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్,



**వరంగల్ (భారత శక్తి)** ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె పరుగును ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, వరంగల్ కలెక్టర్ డా. సత్య శారద, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంట్రామిరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ట్రై సిటీ పరిధి యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ రన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుండి సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు జరిగింది. విజేతలకు అతిథులు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

## హైదరాబాద్‌కు చెందిన నలుగురు మాచర్లలో రోడ్డు ప్రమాదంలో మృతి

**పల్నాడు(భారత శక్తి)** మాచర్ల పట్టణం నగరవనం వద్ద ఈరోజు ఉదయం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని తుఫాను వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తుఫాన్లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడ మృతి చెందారు. మృతులు హైదరాబాద్ నుండి కనిగిరి వెళ్తున్న క్రమంలో జరిగిన ఘటన చోటు చేసుకుంది. మృతులు కదిరి వెంకటేశ్వర్లు, కదిరి శారద, పిడుగు సత్యనారాయణ, పిడుగు అంజలి గా గుర్తించారు. మాచర్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారించారు.

## అల్లుడితో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని.. భర్తను హత్య చేసిన భార్య

**నాగర్ కర్నూలు(భారత శక్తి)** సొంత అల్లుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అడ్డుకుగా వున్నాడని భర్తనే కడతేర్చింది. మొదట అనారోగ్యంతో మరణించాడని భావించిన ఘటనలో పోలీసులు విచారణ అనంతరం ఇది హత్యగా తేల్చారు. నాగర్కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన అమ్మపల్లి యాదయ్య, అలివేలు దంపతులు. అలివేలుకు తమ సొంత అల్లుడు ఆంజనేయులతో వివాహేతర సంబంధం ఏర్పడడంతో.. ఈ విషయం తెలుసుకుని తరచూ యాదయ్య భార్యతో గొడవపడుతున్నాడు. ఈ నెల 23న యాదయ్య ఇంట్లో మృతిచెందగా.. అనారోగ్యంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులను, గ్రామస్తులను భార్య నమ్మించింది. అయితే అంత్యక్రియలకు ముందు శవానికి స్నానం చేయించి దుస్తులు మారుస్తుండగా శరీరంపై గాయాలు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి అన్న కుమారుడు పరశురాములు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు విచారణ చేపట్టి ప్రశ్నించగా.. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో అతని మర్మాంగాలపై దాడి చేసి హత్య చేసినట్లు భార్య అలివేలు ఒప్పుకుంది. అదే రోజు కూతురు, అల్లుడు కూడా ఇంటికి వచ్చి వెళ్లిన నేపథ్యంలో వారి పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో బంధువులు పేర్కొన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పోలీసులు వేధిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆత్మహత్యాయత్నం

**పెద్దపల్లి(భారత శక్తి)** ఎస్సై వేదింపులకు గురిచేస్తున్నాడని బీ ఆర్ ఎస్ నాయకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసాడు. పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన కల్లెపు సంపత్ రావు పెద్దపల్లి పట్టణ ఎస్. ఐ వేదింపులకు గురిచేస్తున్నాడనీ పురుగుల మందుతాగి ఆత్మహత్యం యత్నం చేసాడు. కరీంనగర్ సన్ రైస్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీ ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలపై కొనసాగుతున్న అక్రమ కేసులు పెడుతున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు.

## ఫేమస్ ఫిష్ ఫ్రై'లో కృత్రిమ రంగులు



**హైదరాబాద్(భారత శక్తి)** మల్లేపల్లిలోని 'ఫేమస్ ఫిష్ ఫ్రై' హోటల్లో తనిఖీ చేశారు. తనిఖీల్లో గడువు ముగిసిన ట్రేడ్ లైసెన్స్తో నడపడం, ఆహారంలో కృత్రిమ రంగులు వాడటాన్ని అధికారులు గుర్తించారు. అక్కడ లభించిన ఫుడ్ శాంపిల్స్ సేకరించి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఈూూ) వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.

## షేర్‌గూడలో ఉచిత మెడికల్ క్యాంప్

### - ప్రజలకు వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ




**రంగారెడ్డి జిల్లా జూన్ 26;(భారత శక్తి)** డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షేర్‌గూడ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఘనంగానిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఫార్మసీ విద్యార్థులు మరియు వాలంటీర్లు సేవలందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తోందని సొసైటీ ఎక్స్ గ్యూటీ మెంబర్ జి.మాధవి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందం, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రగ్స్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత

### - గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి. "



**వరంగల్(భారత శక్తి)** డ్రగ్స్ నియంత్రణ ప్రభుత్వం బాధ్యతే కాదు తల్లితండ్రులు వైద్యులు పోలీసులు మేధావులు స్వచ్ఛంద సంస్థలు సినీ ప్రముఖులుఉపాధ్యాయులు అందరి బాధ్యత అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అని అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్డు లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అరికట్టాలంటే నార్కోటి కంట్రోల్ రూమ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నార్కటి కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు డ్రగ్స్ ని అమ్మేవారిని పై కఠిన చర్యలు తీసుకుంటూ వారికి కౌన్సిలింగ్ ద్వారా మంచి మార్గంలో నడిచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుంది జిల్లాలలో కమిషనర్ ఎస్పీ కలెక్టర్ వాళ్లు చెరువుతో మాదకద్రవ్యాలను అరికట్టడం అర్హనీయం ముఖ్యంగా సప్లై చేస్తే ఏరియాలో కాలేజీలు సినిమా హాలు కేసులు క్లబ్బులు హాస్టల్స్ దగ్గర నిఘా ఏర్పాటు చేయాలి ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా కాకుండా బార్డర్లలో సరైన జాగ్రత్తలు తీసుకొని ఎవరైతే గంజాయి రవాణా చేస్తారో వారిని పట్టుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను డ్రగ్స్ అంతరించాలంటే మాదకద్రవ్యాలు అరికట్టాలంటే ప్రతి ఒక్కరు వారి భుజాల మీద వేసుకొని దానిపై పోరాడితేనే తప్ప అది అరికట్టలేమని రాజనాల శ్రీహరి అన్నారు వెంటనే ప్రభుత్వం ప్రజలు అధికారులు అందరూ చొరవతో డ్రగ్స్ ను గంజాయిని మాదకద్రవ్యాలను అరికట్టాల్సిందిగా రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పోలేపాక ప్రసాద్ తులసి శశి మాగంటి శివగంద్రకోట రామచందర్ లో పాల్గొన్నారు

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి

- విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి
- ఫిట్నెస్ లేని విద్యార్థుల బస్సు,వాహనాలను సీజ్ చెయ్యాలి.
- ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ డిమాండ్



**కౌతాళం(భారత శక్తి)** మండల కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి జీవో నెంబర్ ఒకటి కి వ్యతిరేకంగా నడుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల అక్రమ దోపిడిని అరికట్టాలని శుక్రవారం ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ మాట్లాడుతూ కౌతాళం మండలం లో ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్య హక్కు చట్టం నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి విద్యాసంస్థలను నడుపుతున్నారు. విద్యాసంస్థల ప్రారంభం నుండే విద్యార్థుల తల్లిదండ్రులను అడ్మిషన్ల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. కొన్ని విద్యా సంస్థలు అయితే విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లోపం వల్లే ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు వాళ్లకిష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు , ఇప్పటికైనా ప్రభుత్వ నియామ నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు అలాగే విద్యార్థులకు కోసం ఏర్పాటు చేసుకున్న ఫిట్నెస్ లేని బస్సులు, వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు, చిన్న,శివ , ఆకాష్, నర్సప్ప, రాజు, నవీన్, దివాకర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## సోదరభావానికి ప్రతీక మొహర్రం మంత్రి అడ్లూరి



జగిత్యాల, జూన్ 26 (భారత్ శక్తి): మొహర్రం పండుగ సోదరభావానికి ప్రతీక అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురిలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో మంత్రి పాల్గొని పట్టణంలోని నంది చౌరస్తాలో పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణలో హిందూ, ముస్లింలు ఎన్నో ఏళ్లుగా సోదరభావంతో పీర్ల పండుగను జరుపుకోవడం గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఈ సంస్కృతిని కొనసాగించాలని మంత్రి ఆకాంక్షించారు.

## మంత్రి అడ్లూరి చేతుల మీదుగా బీర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



జగిత్యాల, జూన్ 26 (భారత్ శక్తి): ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగిత్యాలలో మెడికల్ కళాశాల, 450 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల ఏర్పాటుతో జిల్లాను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. బీర్‌పూర్ పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొస్తున్నామని, బీర్‌పూర్ పీహెచ్‌సీలో త్వరలోనే 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఏడాదిలోనే పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హరీష్, డీఎంహెచ్‌వో డాక్టర్ శారద, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేటర్ల కొనసాగింపునకు మంత్రి అడ్లూరికి వినతిపత్రం



జగిత్యాల, జూన్ 26 (భారత్ శక్తి ప్రతినిధి): రెవెన్యూ శాఖలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న 632 మంది టైపిస్టులు, కంప్యూటర్ ఆపరేటర్లను యథావిధిగా కొనసాగించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు శుక్రవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన మెమోను రద్దు చేసి తమ సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్టేట్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎం. భూమేష్, జిల్లా అధ్యక్షుడు దేవాల గోపి, రాపర్తి రాజేందర్, నరేష్, మహేందర్, అర్జున్, వినోద్, సల్మాన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్.

భారత శక్తి న్యూస్,భారత శక్తి ప్రతినిధి, జూన్ 26: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), టీజీఎంఎస్ అనుబంధ బాలికల వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి జిల్లా విద్యాశాఖ అధికారి డా. జగన్ మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యాధికారి, తహసీల్దార్, ఎంపీడీవోతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారా ఎంపిక చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన అభ్యర్థుల ఎంపికను నిబంధనల ప్రకారం పూర్తి చేసి జాబితా సమర్పించాలని సూచించారు.

## సీఎం సహాయనిధి పేదలకు గొప్ప వరం

**- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**

కుత్బుల్లాపూర్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 26: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లికి చెందిన బొల్లం సంజీవ రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన హన్మంతన్న, తెలంగాణ శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సహకారంతో బాధితులకు వైద్య చికిత్స మరియు శస్త్రచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF -- LOC) ద్వారా రూ.2,75,000/- (రెండు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు) మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా మంజూరైన CMRF -- LOC పత్రాలను కొలన్ హన్మంత్ రెడ్డి బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి జీవితాల్లో ఆశను నింపుతోంది" అని తెలిపారు.

# సంఘాల పేరుతో విద్యాసంస్థలను ఇబ్బంది పెట్టవద్దు.

- పాఠశాల వాతావరణాన్ని దెబ్బతీవద్దు.
- విద్యాలయం ఆవరణంలో పెద్ద శబ్దాలతో నినాదాలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురి చేయొద్దు.
- విద్యాసంస్థల్లో సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదులు చేస్తే సమస్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారు.
- విద్యార్థుల రవాణా బస్సులు అడ్డగించడం, చందాల రూపంలో డబ్బు వసూళ్లకు పాల్పడడం చట్ట విరుద్ధం.
- సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్.



సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి,జూన్ 26: ప్రవేట్ విద్యాసంస్థల ను సంఘాల పేరుతో ఇబ్బందులు, బెదిరింపులకు గురి చేస్తున్నారు అని వివిధ సమస్యలపై ప్రవేట్ విద్యాసంస్థల నుండి పిర్యాదు వస్తున్నాయి, గురువారం రోజున సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల త్రివేణి పాఠశాల లోకి కొంత మంది వ్యక్తులు విద్యార్థి సంఘాల పేరుతో అక్రమంగా చొరబడి కార్యాలయం తాళాలు పగలగొట్టి, పెద్దగా నినాదాలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురిచేసిన విషయమై యాజమాన్యం పిర్యాదు మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు చట్టపరకారం క్రిమినల్ కేసు నమోదు చేశాం అని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపినారు. విద్యార్థి సంఘాల పేరుతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించవద్దు, విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయవద్దు అని ఈ సందర్భంగా వివిధ రకాల సంఘాలకు డీఎస్పీ సూచించారు. పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, విద్యార్థులను రవాణా చేసే బస్సులను అడ్డుకోవడం, యాజమాన్యాలను లేదా ఉపాధ్యాయులను బెదిరించడం, పెద్ద శబ్దాలతో నినాదాలు చేస్తూ విద్యార్థులు భయపడేలా వాతావరణం సృష్టించడం, చందాల రూపంలో డబ్బు వసూళ్లు చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్ట విరుద్ధం అని హెచ్చరించారు. ప్రవేటు విద్యాసంస్థల్లో ఏవైనా సమస్యలు ఉంటే, వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు, విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేయాలి, సమస్యలపై అధికారులు నిబంధనల ప్రకారం విచారణ, దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అంతే కానీ, విద్యార్థి సంఘాల పేరు చెప్పుకుని పాఠశాలల్లో ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవద్దని, విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ వారికి అసౌకర్యం కలిగించకూడదని సూచించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే విద్యాశాఖ అధికారులకు లేదా ఉన్నతాధికారులకు మాత్రమే నివేదించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విద్యాసంస్థల నిర్వహణకు ఆటంకం కలిగిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ స్పష్టం చేశారు. కేసులు నమోదు చేయడం, బైండోవర్ చేయడం లాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.

# "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్"

**- 600 మందికి పైగా విద్యార్థులతో ఘనంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 26(భారత శక్తి ): అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో శుక్రవారం భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా. సురేష్ అల్లాడి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. జీవితంలో లక్ష్యాలను సాధించాలంటే మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు అలవరుచుకుని ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని ఎంచుకోవాలని సూచించారు.ప్రజల్లో డ్రగ్స్‌పై చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం 600 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్ (ఖ్యం చీశ్ ాశీ ణతీబస్త్రం,్వర్ శీ ాఱటవ)" అనే ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని బలంగా చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# 99 రోజుల కార్యాచరణలో ప్రజల వినతులు, సమస్యల పరిష్కారం, పెండింగ్ అంశాలతో డాక్యుమెంట్ చేయాలి.

**- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్**

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 26(భారత శక్తి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్తు కార్యచరణపై నివేదిక సిద్ధం చేయాలని, ప్రజల వినతులు, సమస్యల పరిష్కారం, పెండింగ్ అంశాలపై డాక్యుమెంట్ రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో 99 రోజుల పాటు చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులకు సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ప్రతి గ్రామంలో 4 రకాల చెత్త నిర్వహణ చేపట్టాలని, వ్యర్థాల నుంచి ఉపయోగకర ఉత్పత్తుల తయారీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ కొరకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆధ్వర్యంలో తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరిలో ఊట కుంట ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దాదాపు 50 లక్షల మంది మహిళలకు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారుచేసే అవకాశాన్ని స్వయం సహాయక సంఘాలకు కల్పించి ఆదాయ వనరులను పెంపొందించడం జరిగిందని తెలిపారు. దాదాపు 1 లక్ష మంది విద్యార్థులకు దుస్తులు అందించడం జరిగిందని, విద్యా సంస్థల సమీపంలో ఎలాంటి మురికి ప్రాంతాలు లేకుండా శుభ్రపరచాలని తెలిపారు. మాదకద్రవ్యాలు, గంజాయి వంటి హానికర పదార్థాలను పూర్తిగా నిరోధించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంట మార్పిడి విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పంట మార్పిడి వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని, అదనపు ఆదాయాన్ని వృద్ధి చేసుకునేలా అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు. విద్య ఆవశ్యకతను తెలుసుకొని ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ చర్యలు తీసుకుంటుందని, ప్రతి ఒక్కరూ చదువుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో విద్యారంగంలో అమలు చేస్తున్న విధానాలు అభినందనీయమని, భవిష్యత్తులో ఇలాగే కొనసాగించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో సెంట్రింగ్ యూనిట్లు, ఫ్లై యాష్ బ్రిక్స్ యూనిట్ల ఏర్పాటుతో పాటు ఇతర వ్యాపార రంగాలలో రాణించేలా చేయూత అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. త్వరలో ప్రభుత్వం పింఛన్ల విషయంలో ప్రజలకు శుభవార్త చెబుతుందని, పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల జీవన ప్రామాణికరణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇన్స్టంట్ స్పౌస్ పెన్షన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని, ఈ క్రమంలో ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, సంబంధిత పరిష్కార నివేదిక పత్రాలను పోర్టల్ లో నమోదు చేయాలని, సమస్యల పరిష్కార విధానం నిజాయితీగా, పారదర్శకంగా ఉండాలని తెలిపారు.

- జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 3 వేల 73 మంది వ్యాధిగ్రస్తులను పరీక్షించి 251 మంది చిన్నపిల్లల వైద్య నిపుణుల ద్వారా అందించడం జరిగిందని, క్షయ నిర్మూలనలో భాగంగా 3 వేల 190 మంది అనుమానితులకు ఎక్స్ రే తీసి 89 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. యాంటీబయోటిక్ అధిక వినియోగంపై నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అధిక మొత్తంలో సదరం శిబిరాలలో దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. అరవై అలైవ్ లో భాగంగా రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరచడం జరిగిందని, ప్రమాద ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని వసతి గృహాలలో పారిశుధ్యం, ఆహార నాణ్యత, విద్యార్థుల సంక్షేమంపై చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. బడిబాట కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల సంఖ్య పెంపొందించడం జరిగిందని, జిల్లాలో బాలికల విద్య పై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో భోజనశాల, అదనపు గదుల నిర్మాణం చేపట్టి అవసరమైన సామాగ్రి సమకూర్చడం జరిగిందని, ఈ విద్యాలయాలలో పరిమితికి మించి అడ్మిషన్లు అందించి విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనాథలు, ఒక తల్లి/తండ్రి గల పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, నిత్యవసరాలు అందించడం జరుగుతుందని తెలిపారు. రైతు వేదికలలో సమావేశాలు నిర్వహించి భూసార పెంపుదల, ఎరువుల బుకింగ్, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానవన పంటలు, పంట మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ఇప్పటివరకు 10 వేల 305 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, 2 వేల 132 ఇండ్లు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, మిగతా పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వి.బి.జి. రాంజీ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని గ్రామపంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందించాలని, త్వరలో కార్మికులకు బీమా సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, కుక్కలు, కోతుల బెడద నివారణ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీధి దీపాల మార్పిడిలో అక్రమాలకు తావు లేకుండా పర్యవేక్షించడంతో పాటు సోలార్ విద్యుత్ ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ ఆర్థిక వనరుల అభివృద్ధి దిశగా ప్రణాళిక రూపొందించుకుని తదనగుణంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy